

విజయోస్తు..



ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29 : మెడికల్, ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దిక్సూచిగా పరిగణించే ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాధారణ ఎన్నికల దృష్ట్యా ఈ ఏడాది కొంచెం ముందుగానే జరుగుతున్న ఈ పరీక్షలకు పశ్చిమ గోదావరి జిల్లాలో ఫస్టియర్ విద్యార్థులు 17,806 మంది, సెకండియర్ విద్యార్థులు 18,143 మంది హాజరుకానున్నారు. ఏలూరు జిల్లాలో సైన్స్, హ్యూమానిటీస్ గ్రూప్‌లలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 32,445 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 79 ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి 25,908 మంది రిజిస్టర్ చేసుకోగా, మిగతా వారంతా ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని వివిధ శాఖల కళాశాలల్లో చదువుతున్న వారే. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 15,656 మంది, ద్వితీయ సంవత్సరం 16,789 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏలూరు జిల్లాలో పరీక్షలు జరిగే 51 కేంద్రాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 50 కేంద్రాల పరిధిలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా 144 సెక్షన్‌ను పోలీసులు విధించారు. అన్ని పరీక్ష గదుల్లో సీసీ కెమెరాలను అమర్చడం ఇప్పటికే పూర్తయిందని, వీటిని ఏలూరు డీవీఈవో కార్యాలయంతోపాటు, అమరావతిలోని ఇంటర్‌బోర్డు పరీక్షల ప్రధాన కార్యాలయంతో అనుసంధానం చేసి ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షించినట్టు ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ బి.ప్రభాకరరావు వెల్లడించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్షలు సజావుగా జరిగేందుకు వీలుగా 800 మంది ఇన్విజిలేటర్లు, 51 కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, 21 మంది కస్టోడియన్లను నియమించామని వివరించారు. మాల్‌ప్రాక్టీస్ వంటివి పట్టివేసేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. పశ్చిమ గోదావరిలో 50 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 50 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఏడుగురు అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులు, 13 మంది కస్టోడియన్స్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్‌లు, వెయ్యి మంది వరకు ఇన్విజిలేటర్‌లు ఉంటారు.

హాల్ టిక్కెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా..

ట్యూషన్ ఫీజులను చెల్లించలేదన్న సాకుతో కొన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ హాల్ టిక్కెట్లను ఇవ్వడం లేదన్న ఆరోపణలపై ఇంటర్ బోర్డు గురువారం స్పష్టతనిచ్చింది. ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన హాల్‌టిక్కెట్‌ను విద్యార్థి డౌన్‌లోడ్ చేసుకుని దానిపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకంగాని, కళాశాల అధీకృత ముద్రగాని లేనప్పటికీ నేరుగా పరీక్షకు హాజరు కావచ్చునని డీవీఈవో ప్రభాకరరావు వెల్లడించారు. జిల్లాలో ఇంతవరకు హాల్ టిక్కెట్‌లను కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదంటూ ఏ ఒక్క విద్యార్థి తమకు ఫిర్యాదు చేయలేదని వివరించారు. కుక్కునూరు, వేలేరుపాడులలోని పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అక్కడ అదనపు నిఘా ఏర్పాటు చేశారు.

నిమిషం లేటైనా అనుమతి లేదు..

- విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8.30 గంటల నుంచే అనుమతిస్తారు.
- పరీక్ష ప్రారంభ సమయం ఉదయం తొమ్మిది గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరు.
- ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరం.
- గతంలో మాదిరి పరీక్ష కేంద్రం నుంచి ఉదయం 11.30 గంటలకే వెళ్లాలనుకునే విద్యార్థులను ఇకపై పంపవద్దని, ఆ ప్రకారం పరీక్ష ముగిసే సమయం అంటే మధ్యాహ్నం 12 గంటల వరకు ఖచ్చితంగా పరీక్షా హాలులోనే ఉండాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు.
- ఎవరైనా తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రికి తీసుకెళ్ళాల్సి వస్తే పరీక్ష కేంద్రంలోని ప్రథమ చికిత్సా కేంద్రంలో విధులు నిర్వర్తించే ఏఎన్‌ఎం సాయం తీసుకుని విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేసి తీసుకువెళ్ళేలా పరీక్షల నిర్వాహకులకు సూచనలు చేశారు.
- ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా ఈ దఫా మరిన్ని చర్యలు చేపట్టారు. ప్రతీ ప్రశ్నాపత్రంపై బార్ కోడ్‌ను ముద్రించడం వల్ల ఎక్కడైనా లీక్ అయినా ఇట్టే పసిగట్టేందుకు వీలుగా ఈ భద్రతా చర్యలు తీసుకున్నారు.
- పరీక్ష కేంద్రంలో ఒక్క చీఫ్ సూపరింటెండెంట్ మాత్రం బేసిక్ మోడల్ సెల్‌ఫోన్‌ను తీసుకెళ్ళాలని, మిగతా వారెవరూ ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్ళవద్దని పశ్చిమ గోదావరి జిల్లా ఎగ్జామ్ కన్వీనర్ చంద్రశేఖర్ బాబు తెలిపారు.
- పరీక్ష హాలులోకి విద్యార్థులు ఎలక్ట్రికల్ వస్తువులు, వాచ్, క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్స్ వంటివి తీసుకురాకూడదు.

హైస్కూల్ ప్లస్‌లపైనే అందరి దృష్టి

మండలానికో హైస్కూల్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం గతేడాది ఇంటర్ విద్యతో వాటిని హైస్కూల్ ప్లస్‌లుగా (జడ్పీ జూనియర్ కళాశాల) అప్‌గ్రేడ్ చేసింది. ఆర్భాటంగా హైస్కూల్ ప్లస్‌లు జిల్లాలో 24 ఏర్పాటయ్యాయి. కుక్కునూరు, వేలేరుపాడు, వేలేరులలో మూడు కేజీబీవీలను ప్రారంభించారు. వీటిని ప్రారంభించడంలో చూపించిన హడావుడి అధ్యాపకుల నియామకాలు, పుస్తకాలను ఇవ్వడంలో ప్రభుత్వం వెనుకబడింది. ఫలితంగా వీటిలో ప్రథమ సంవత్సరం కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన 181 మంది విద్యార్థుల్లో కేవలం 17 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులంతా ఇప్పుడు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారిలో హైస్కూల్ ప్లస్‌ల నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులు 229 మంది, ద్వితీయ సంవత్సరం 120 మంది ఉన్నారు. వీరితోపాటు కేజీబీవీల్లో మొత్తం 91 మంది ప్రథమ. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. ఇపుడు కొత్తగా ఏర్పాటైన హైస్కూల్ ప్లస్‌లు, కేజీబీవీల్లో ఇంటర్ ఉత్తీర్ణతపైనే సర్వత్రా ఆసక్తి నెలకొంది.

గంజాయి నియంత్రణకు పటిష్ఠ చర్యలు : కలెక్టర్



ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 29 : గంజాయి సరఫరా, వినియోగించే వారికి ఆరునెలల జైలుశిక్ష, ఇతర చట్టపరమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి అటువంటి చర్యలకు పాల్పడే వారిని నియంత్రించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. గంజాయి నియంత్రణ, డ్రగ్స్ అక్రమరవాణా తదితర అంశాలపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై ఎస్పీ డి.మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ గంజాయి రవాణా, సరఫరా వినియోగం నియంత్రణలో కట్టుదిట్ట చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో డీఆర్వో పుష్పమణి, కమిటీ సభ్యులు దేవి, దీక్షిత, డాక్టర్ చంద్ర హాస్, న్యాయవాది కె.సత్యనారాయణ, డీఈవో ఎస్.అబ్రహం, ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ అబీబ్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 29 : ఏలూరు జిల్లాకు చెందిన ఎన్నికల సామాగ్రి భద్రపరిచే గోదామును ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా సందర్శించినట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్‌లు భద్రపరిచే గోదామును గురువారం సందర్శించి సీల్‌లను కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఆర్వో పుష్పమణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29 : ఉమ్మడి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ యూనిట్ పరిధిలో ఎన్‌హెచ్‌ఎం-ఎన్‌టీఈపీ స్కీంలో వైద్య ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అందిన దరఖాస్తుల వడపోత అనంతరం అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలోని వివరాల్లో ఏమైనా అభ్యంతరాలుంటే మార్చి 1నుంచి 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోని జిల్లా క్షయ నివారణాధికారి కార్యాలయంలో తెలపాలని సూచించారు.



ఎవరు? ఎక్కడ?



గెలుపు గుర్రాలపై ఎడతెగని కసరత్తు

- కీలక నియోజక వర్గాల్లోనూ ఇంకా సస్పెన్సే
- ఇప్పటికే టీడీపీ ఏడు స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన
- ఒకట్రెండు రోజుల్లో జనసేన జాబితా
- వైసీపీలోనూ పొంచివున్న మార్పులు
- కాంగ్రెస్ ఇంటర్వ్యూలు ఆరంభం.. తేల్చని కమలం

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పూర్తి స్థాయి జాబితా అధికార వైసీపీ ఇప్పటికీ పూర్తి చేయ లేదు. పొత్తుల నడుమ టీడీపీ కొన్ని స్థానా లనే ప్రకటించి, మిగతా స్థానాలపై సాగదీస్తూనే ఉంది. అదేబాటలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తాను భీమవరం నుంచి పోటీ చేస్తానో లేదో తేల్చలేదు సరికదా పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి వుంది. కాంగ్రెస్ తన చేతికందిన దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులతో భేటీలకు దిగుతోంది. బీజేపీలో దరఖాస్తుల తతంగం పూర్తయినా ప్రకటించ డంలో సస్పెన్స్. ఇలా ప్రధాన పక్షాలన్నిటిలోనూ ఎడతెగని కసరత్తు సాగుతోంది. ఆశావహు లంతా కంటి మీద నిదుర లేకుండా వున్నారు.

\- ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి

పొత్తులోనూ..

అధికార వైసీపీలో మాదిరిగానే కొన్నిచోట్ల జనసేన-టీడీపీ పొత్తు కూటమిలోనూ ఇంకా గందరగోళం సాగుతోంది. తెలుగుదేశం తన వంతుగా ఏలూరు, నూజివీడు, చింతలపూడి, తణుకు, ఆచంట, పాలకొల్లు, ఉండి నుంచి పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది. తణుకు, ఏలూరులో జనసేన అనుకూలురు ఈ నిర్ణయంపై తమ వ్యతిరేకతను బహి రంగంగా ప్రకటించారు. జనసేన అగ్రనాయకత్వం దీన్ని సీరియస్‌గా పరిగణించింది. తాడేపల్లిగూడెం జెండా సభలో జనసేనాధిపతి పవన్ కల్యాణ్ తన శ్రేణులకు కొన్ని సంకేతాలిచ్చారు. ఉమ్మడిగా రాష్ట్ర ప్రయోజనాలను ఆశించి మాత్రమే పొత్తుకు దిగామని, సీట్లు సర్దుబాటు చేసుకున్నామని, దీన్ని అర్థం చేసుకోకుండా తననే ఎలా ప్రశ్నిస్తారంటూ కేడర్‌కు చురకలు అంటించారు. కొన్ని నియోజకవర్గాల్లో ఉమ్మడి పొత్తు పేరిట తాను, చంద్రబాబు కలిసి పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తే దీనికి భిన్నంగా కొన్నిచోట్ల పార్టీ శ్రేణులు వీధుల కెక్కడంపై అసంతృప్తి వెళ్ళగక్కారు. 'ఒక పార్టీ వెనుక ఇంకో పార్టీ వెళ్లదు. రెండు పార్టీలూ కలిసే వెళ్తాయి' అంటూ స్పష్టంగా పొత్తుపై విడమర్చి కేడర్‌కు అర్థమయ్యేలా చెప్పారు. తాను కొన్ని నిర్ణయాలు తీసుకోబోతున్నానని, తన అడుగులో అడుగు వేసే వారే తన వారన్నట్టుగా తేల్చారు. గోదావరి జిల్లాలో జనసేన తరఫున పోటీ చేసే నియోజకవర్గాల నుంచి అభ్యర్థులను నేడో రేపో తేల్చబోతున్నారు. దానికి ముందుగానే పవన్ ఈ రకంగా సంకేతాలిచ్చారంటే కేడర్ క్రమశిక్షణగా ఉండాల్సిందేనని సూచించినట్లయింది. నరసాపురంతోపాటు మరో మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి వుంది. ఇప్పుడు జనసైనికుల్లో ఆతృత, ఆందోళన కనిపిస్తోంది. తమ పార్టీ అధ్యక్షుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని టెన్షన్‌లో వున్నారు.

టీడీపీలో గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్ వంటి వారి అభ్యర్థిత్వాలను రెండో జాబితాలో ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో కేడర్ తమ నాయకులకు కాకుండా ఇంకెవరికిస్తారంటూ ధీమాతో ఉన్నారు. నరసాపురం టీడీపీలోను కొంత అసంతృప్తి బయటపడింది. ఉండి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే శివరామరాజు మధ్య సయోధ్య కుదిర్చేందుకు టీడీపీ ప్రయత్నాలు ఆరంభించింది. ప్రత్యేకించి హైదరాబాద్ కేంద్రంగా ఈ బుజ్జగింపు జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే శివరామరాజు తనను మాట వరసకైనా సంప్రదించకుండా, తన రాజకీయ భవిష్యత్ నిర్దేశించకుండా పార్టీ ఏకపక్షంగా ప్రవర్తించిందన్న ఆగ్రహంతో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు మిగతా సిట్టింగ్‌లకు అవకాశం ఇచ్చినట్టుగానే తనకూ లభించిందని దీంట్లో తన తప్పేమిటన్నట్లుగా ప్రశ్నిస్తున్నారు. ఉండి టీడీపీలో నెలకొన్న సంక్షోభం సమసిపోతుందా లేక రగిలి మరింత జటిలం కాబోతుందా.. అనేది ఒకటి రెండ్రోజుల్లోనే తేలబోతోంది.

వైసీపీ మార్పులు..చేర్పులు

ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పక్షాలన్నీ తగిన అర్హతలున్న అభ్యర్థులను ఎంపిక చేసి మరీ రంగంలోకి దింపాలనుకుంటున్నాయి. ఏలూరు, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటి వరకు పూర్తి స్థాయి జాబితాను అధికారికంగా ప్రకటించలేదు. అధికార వైసీపీ మార్పులు చేర్పులతోనే విడతల వారీగా జాబితాలు ప్రకటిస్తూ వచ్చింది. చింతలపూడి, పోలవరం మినహా మరే స్థానంలోనూ మార్పు జరగలేదు. మిగతా స్థానాల్లో తెలుగుదేశం-జనసేన కూటమి అభ్యర్థులకు దీటుగా సిట్టింగ్‌లను కొనసాగిస్తారా లేదంటే చివరి క్షణాల్లో మార్పులకు దిగుతారా అనేది తేలాల్సి వుంది. నూజివీడులో టీడీపీ నుంచి ఈ మధ్యనే వైసీపీకి అనుకూలంగా బయటకు వచ్చిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నియోజకవర్గం అంతా పర్యటిస్తూ తన బలాన్ని అంచనా వేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను తనకు నూజివీడునే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా ప్రతాప అప్పారావు తిరిగి పోటీకి వీలుగా అంతా సిద్ధం చేసుకున్నారు. నూజివీడు వైసీపీ సీటు విషయంలో తుది నిర్ణయానికి అగ్రనాయకత్వం దాదాపు రంగం సిద్ధం చేసింది. భీమవరం నుంచి పవన్ కల్యాణ్ పోటీ చేసినా, చేయకపోయినా తమ పార్టీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాసేనని ఇప్పటికే తుది నిర్ణయానికి వచ్చారు. అధికారిక తుది జాబితాలో ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు, నూజివీడులలో దాదాపు సిట్టింగ్‌లవైపే వైసీపీ మొగ్గు చూపుతోంది. నరసాపురం, ఆచంట సిట్టింగ్‌లతోపాటు, తణుకు, తాడేపల్లిగూడెంలో ఇద్దరు మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణలకే పూర్తి ఛాన్సు ఉంది. ఈ జాబితాలో ఎలాంటి మార్పులు చేర్పులు ఉండవని భావిస్తున్నారు. తాజాగా పాలకొల్లులో గుడాల గోపీ, ఉండిలో పీవీఎల్ నరసింహరాజునే యథావిధిగా వుంచుతారా లేదా ఉండిలో మార్పులు చేర్పులు వుంటాయా అనేది తేలాల్సి ఉంది.

కాంగ్రెస్‌లో కోలాటం

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారందరితో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గురువారం నుంచి ముఖాముఖి భేటీ అవుతున్నారు. మౌఖికంగా లోతట్టు విషయాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఏలూరు, నరసాపురం పార్లమెంట్ పరిధిలో టిక్కెట్ ఆశిస్తూ పెద్ద సంఖ్యలోనే దరఖాస్తు చేసుకున్నారు. నాలుగైదు రోజుల్లోనే కాంగ్రెస్ పక్షాన పోటీ చేసే అభ్యర్థుల వివరాలు బహిర్గతమవుతాయని చెబుతున్నారు. మరోవైపు నరసాపురం పార్లమెంటరీ కన్వీనర్ జెట్టి గురునాథరావు కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. వైసీపీలో చేరేలా అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆయనతోపాటు ఇంకొంతమంది ఆ దిశగానే స్పందించారు.

బీజేపీ ఇంకా తేల్చలేదు

తమ పార్టీకి మెరుగైన బలం ఉందని చెప్పుకుంటున్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి అభ్యర్థులను వడబోసింది. పార్లమెంటరీ, అసెంబ్లీ స్థానాలకు ఎవరెవరిని రంగంలోకి దించాలనే దానిపై దాదాపు ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఎటు తిరిగి పొత్తు తేలకపోవడంతో జాబితా కేంద్ర నాయకత్వం ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. మూడో తేదీలోపు అటో ఇటో తేల్చబోతున్నారని పార్టీ నేతలు భావిస్తున్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

- 236 చెరువుల్లో నీరు నింపే కార్యక్రమం

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 29 : వేసవి నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల్లోని మంచినీటి చెరువులను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో గోదావరి, కృష్ణా జలాలతో నింపుతున్నారు. జిల్లాలో మొత్తం 236 చెరువులు ఉండగా వీటిలో 13 సీపీడబ్ల్యూఎస్ పథకాలు కాగా 196 పీడబ్ల్యూఎస్ పథకాలు ఉన్నాయి. మిగిలిన 27 చెరువులు ఇతర పథకాల్లో ఉన్నాయి. 159 చెరువులను కృష్ణా జలాలతో నింపాల్సి ఉండగా మిగిలిన 77 చెరువులను గోదావరి జలాలతో నింపుతారు. ఇప్పటికే కృష్ణా నీటి లభ్యత తక్కువగా ఉండడంతో ఆ పరిధిలోని 148 చెరువుల్లో మాత్రమే నీరు పూర్తిస్థాయిలో నింపారు. గోదావరి బేసిన్‌లోని 77 చెరువుల్లో నీరు నింపుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

టెట్‌కు 67 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29:జిల్లాలో గురువారం జరిగిన టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) పరీక్షలకు ఉదయం 333 మంది, మధ్యాహ్నం 338 మంది అభ్యర్థులు హాజరుకాగా 67 మంది గైర్హాజరైనట్టు డీఈవో అబ్రహం తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

స్కూల్‌కు రోజూ ఆలస్యం.. టీచర్ సస్పెన్షన్

ముదినేపల్లి, ఫిబ్రవరి 29 : విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న చేవూరు ఎంపీయూపీ పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ తనికెళ్ల ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ డీఈవో అబ్రహం గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంఈవో-2 కె.నరేష్‌కుమార్ తెలిపారు. రెండు నెలలుగా పాఠశాలలో ముఖ ఆధారిత హాజరు వేయకపోవడం, పాఠశాలకు గంట ఆలస్యంగా రావడం, గురజ ఎలిమెంటరీ పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపుతూ డీఈవో జారీచేసిన ఉత్తర్వులను తీసుకోకపోవడం తదితర అభియోగాలపై విచారణ జరిపారు. ఇవి నిర్ధారణ కావడంతో అనంతరం డీఈవో సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

ఆక్వా మేతలు అధరహో!

- మరోవైపు చేపల ధరలు తగ్గుముఖం
- పెట్టుబడులు రాక రైతులు నష్టాల పాలు



రొయ్యల మేత..డీవోబీ తవుడు



కలిదిండి, ఫిబ్రవరి 29 : ఆక్వా మేతల ధరలు పెరగడం, చేపలు, రొయ్యల ధరలు తగ్గడంతో ఆక్వా రైతులు నష్టాల పాలవుతున్నారు. చేపల మేత డీవోబీ తవుడు మార్కెట్‌లో పది టన్నుల ధర రూ.1.80 లక్షలు పలుకుతోంది. మొన్నటి వరకు రూ.1.20 లక్షలు ఉన్న తవుడు అమాంతంగా అరవై వేలు పెరిగింది. రొయ్యల మేత కేజీ మొన్నటి వరకు రూ.70 ఉండగా, రూ.100కు పెరిగింది. చేపల మేత పది టన్నులకు రూ.60 వేలు, రొయ్యల మేత కిలో రూ.30 చొప్పున పెరగగా మరోవైపు చేపల, రొయ్యల ధరలు పతనమవ్వడం తో పెట్టుబడులు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం తెల్ల చేపల ధర కిలో రూ.105, రొయ్యల 100 కౌంటు కిలో రూ.230లకు కొనుగోలు చేస్తున్నారు. చేపలకు కిలో రూ.10, రొయ్యలకు కిలో రూ.20 చొప్పున ధర తగ్గడం, మేతల ధరలు ఒక్కసారిగా పెరగడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. చేప కిలో పెరగాలంటే ప్రస్తుతం రూ.40 అదనంగా ఖర్చు అవుతోంది. డీవోబీ, పత్తిపిండి, వేరుశెనగ, చెక్క ధరలు పెరగడంతోపాటు చెరువుల లీజు ధరలు పెరగ డంతో కిలో చేపకు రూ.40 అదనంగా ఖర్చు పెరిగింది. మార్కెట్‌లో చేపల ధర పెరగడం లేదని ఖర్చులు తగ్గట్టు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పెరిగిన మేత ధరలతో నష్టాలు చూడాల్సిందేనని రైతులు అంటున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ఆక్సిజన్ లోపంతో చేపల చనిపోతూ నష్టాలు వాటిల్లు తున్నాయని మరో వైపు ప్రభుత్వం విద్యుత్ యూనిట్ రేట్లు పెంచడం సబ్సిడీ ఎత్తేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మేతల ధరలు నియంత్రించాలి



డీవోబీ, పత్తి పిండి, వేరుశెనగ చెక్క ధరలు పెరగడంతో చేప కిలో పెరగడానికి రూ.40 అదనంగా ఖర్చు అవుతోంది. చేపల ధర రోజు రోజుకు తగ్గుతోంది. విద్యుత్ యూనిట్ రేటు పెంచారు. దీంతో పెట్టుబడులు రాక నష్టాల పాలవు తున్నాం. ప్రభుత్వం ఈ మేతల ధరలను నియంత్రించి చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

\- ఎస్.చలపతిరావు, ఆక్వా రైతు

ప్రశ్నార్థకంగా చేపలు, రొయ్యల సాగు



పెరిగిన డీవోబీ తవుడు ధర గుదిబండగా మారింది. ఒక్కసారిగా ధర పెరగడం వల్ల సాగు మధ్యలో ఉన్న రైతులు ఏమీ చేయలేని పరిస్థితి. డీవోబీ తవుడు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడంతో సమస్యలు ఉన్నాయి. నగదు చెల్లిస్తేనే డీవోబీ తవుడు దిగుమతి చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు పుట్టడం లేదు. పెరిగిన మేత ధరలతో చేపల, రొయ్యల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

\- ఎం.బుల్లి వెంకయ్య, ఆక్వా రైతు

చికెన్..పరుగు!

- తగ్గిన కోళ్ల సరఫరాతో ధరలకు రెక్కలు



ముదినేపల్లి, ఫిబ్రవరి 29: మార్కెట్‌లో చికెన్ ధరలు భారీగా పెరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల దిగుమతులు తగ్గిపోవడంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ముదినేపల్లి ప్రాంతంలో స్కిన్ లెస్ చికెన్ కేజీ రూ.260 నుంచి ఒకేసారి అమాంతంగా రూ.320కి చేరింది. స్కిన్‌తో కూడిన చికెన్ కేజీ రూ.220 నుంచి రూ.280కి పెరిగింది. బోన్‌లెస్ చికెన్ కేజీ రూ.380 నుంచి రూ.400 వరకు ధర పలుకుతోంది. ఫారం కోడి ధర కేజీ రూ.170 నుంచి రూ.200కి పెరిగింది. చికెన్‌ను ఎక్కువగా వినియోగించే మధ్య తరగతి, సామాన్య ప్రజలకు ఈ ధరలు భరించలేనివిగా ఉన్నాయి. కోళ్ల ఫారంల వద్ద కోళ్ల ధరలు పెరగడం, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి కోళ్ల సరఫరా తగ్గడంతో మార్కెట్‌లో కొరత ఏర్పడి ధరలు పెరిగాయి. బర్డ్ ఫ్లూ వ్యాధి కారణంగా నెల్లూరు జిల్లా నుంచి ముదినేపల్లి ప్రాంతానికి కోళ్ల దిగుమతి దాదాపు స్తంభించింది. ఈ నేపథ్యంలో ధరలు మండిపోతున్నాయి. సామాన్యులు చికెన్‌ను కొనే స్థితిలో లేరు.

వెల్లులి కేజీ రూ.500



కలిదిండి, ఫిబ్రవరి 29 : వెల్లుల్లి ధర ఆకాశన్నంటడంతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వెల్లుల్లి ధర కిలో రూ.500 పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజలు వెల్లుల్లి వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి. వెల్లుల్లి దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో సరఫరా పడిపోవడంతో ధర అమాంతంగా పెరిగింది. రిటైల్ మార్కెట్‌లో రూ.350 నుంచి రూ.500కు చేరుకుంది.

మర్చిపోలేని పెళ్లి జ్ఞాపకం

▸▸ లీప్ సంవత్సరం.. ఫిబ్రవరి 29న భారీగా వివాహాలు

భీమవరం టౌన్,ఫిబ్రవరి 29 : ఈ ఏడాది ఫిబ్రవరి 29కి ప్రత్యేకస్థానం ఉంది.. లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి నెలాఖరి రోజు.. నాలుగేళ్లకు వచ్చే ఈరోజు కోసం చాలామంది ఎదురుచూస్తారు. దీనికి కారణం ఆ రోజు పెళ్ళిరోజుకావచ్చు, పుట్టిన రోజు కావచ్చు. మరేదైనా కావచ్చు అందుకే ఈ తేదీకి ప్రాముఖ్యత. ముహూర్తం బలంగా ఉండడంతో గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా వేలాది వివాహాలు జరిగాయి. రాత్రి 10.53 నిమిషాల ముహూర్తం బాగుండటంతోపాటు అన్ని నక్షత్రాల వారికి అనుకూలంగా ఉండడంతో చాలా చోట్ల వివాహాలు జరిగాయి. లగ్నంలో చంద్రుడు, సప్తమంల గురుడు ఉన్నకారణంగా ఇరువురు పరస్పర దృష్టి కలిగి ఉండడంతో బలమైన ముహూర్తంగా పండితులు చెబుతున్నారు. మాఘమాసంలో ఆఖరి ముహూర్తం ఇదే అని చెబుతున్నారు. ఈ తేదీన వివాహం చేసుకున్నవారు.. పుట్టిన వారు మరో నాలుగేళ్లకు పెళ్ళిరోజు, పుట్టినరోజులు జరుపుకోవాల్సి వస్తుంది. గతంలో కూడా ఈవిధంగా ముహూర్తాలు వచ్చిన సందర్భాలు ఉన్నట్టు చెబుతున్నారు. వచ్చే నెల 24వ తేదీ వరకు ముహూర్తాలు ఉన్నాయిని, మే నెల నుంచి ఆరు నెలలపాటు ముహూర్తాలు ఉండవని, దీనికి కారణం శుక్ర, గురుమూఢాలు రావడంతో పాటు ఆషాడం, భాద్రపద మాసాలు శూన్యమాసాలు కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని పండితులు తెలిపారు.

నిట్ విద్యార్థికి ఈత పోటీల్లో రెండు పతకాలు

▸▸ విద్యార్థిని అభినందించిన నిట్ రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి


గుణవంత్‌రెడ్డిని అభినందిస్తున్న నిట్ ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 29 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి దుబ్బా గుణవంత్‌రెడ్డి ఇటీవల ఒడిశాలోని రూర్కెల్ నిట్‌లో నిర్వహించిన ఆలిండియా ఇంటర్ ఎన్ఐటీల ఈత పోటీలలో బ్యాక్ స్ట్రోక్ 100 మీటర్ల విభాగంలో రజితం, బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్ల విభాగంలో కాంస్య పతకాలను సాధించాడు. ఈ సందర్భంగా గురువారం నిట్ ప్రాగంణంలో విద్యార్థిని పలువురు అభినందించారు. విద్యార్థి గుణవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏడో తరగతి చదువుతుండగానే స్విమ్మింగ్‌పై ఆసక్తి పెరగడంతో తల్లిదండ్రులు వెంకటరామలింగేశ్వరెడ్డి, శ్రీలత ప్రోత్సాహంతో ఈత నేర్చుకున్నానన్నాడు. జిల్లా, రాష్ట్రస్థాయి ఈతల పోటీల్లో పలు పతకాలను సాధించా నన్నాడు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, సాస్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ కిరణ్‌తీపర్తి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డాక్టర్ వి.సందీప్, సాస్ అసిస్టెంట్‌లు డాక్టర్ వి.శ్రీనివాస్, సంధ్యారాణి, సాయిరాం పాల్గొన్నారు.

ఉండి ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ

ఉండి, ఫిబ్రవరి 29: ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో స్వల్పకాలిక శిక్షణ కల్పించి వారికి అమెజాన్ సంస్థలో ఉద్యోగం కల్పిస్తామని పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ ప్రధాన అధికార వేగేశ్న శ్రీనివాసరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఉండి ఐటీఐ భీమవరం వారు లాజిస్టిక్ స్కిల్ కౌన్సిల్ వారితో ఒప్పందం జరిగిందన్నారు. దీనిలో భాగంగా స్వల్పకాలిక శిక్షణ కల్పించి అమెజాన్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఈనెల పదో తేదీ లోపు ఉండి ఐటీలో సంప్రదించాలని కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18-35 ఏళ్ల వయస్సు గల స్త్రీలు, పురుషులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరిశ్రమల పనితీరు మెరుగుదలకు సర్వే

▸▸ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతిరావు

భీమవరంటౌన్, ఫిబ్రవరి 29 : చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరును మెరుగు పరిచేందుకు, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం నిర్వహించే సర్వేకు మైక్రో, స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)లు సహకరించాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ క్యాంపు ద్వారా జిల్లాలోని అన్ని ఎంఎస్‌ఎంఈ లను సర్వే చేస్తామన్నారు. తయారీ, సేవ, వాణిజ్య రంగాలలోని అన్ని పరిశ్రమలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొస్తామన్నారు. వీటిని ఏపీ ఎంఎస్‌ఎంఈవన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ఈ సర్వే కోసం ఎంఎస్‌ఎంఈ సర్వే అండ్ సపోర్టు అనే మొబైల్ యాప్‌ను రూపొందించామన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాలలో వార్డు ఎమెనిటీ సెక్రటరీస్ ద్వారా సర్వేను నిర్వహిస్తామన్నారు. ఈ సర్వే ప్రాతిపదికగా జిల్లాలోని అన్ని స్మాల్ అండ్ మీడియంస్కేల్ ఇండ్రస్ట్రీస్‌ల డేటా బేస్‌ను అభివృద్ధి చేయడం, పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించడం, మహిళలు, ఎస్టీ, ఎస్సీ పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను అభివృద్ధి పరచటం మొదలైన సేవలను అందిస్తామన్నారు. దీని ద్వారా పలు రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హులు అవతారని తెలిపారు.

మునిసిపల్ ఆస్తిపన్ను చెల్లింపునకు వడ్డీరాయితీ

భీమవరంటౌన్, ఫిబ్రవరి 29 :మునిసిపాల్టీలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పాత బకాయిలతోపాటు ఈ ఏడాదికి సంబంధించిన ఆస్తిపన్నును ఒకే మొత్తంలో చెల్లించే వారికి వడ్డీరాయితీ ఇస్తున్నట్టుగా జీవో విడుదల చేశారు. బకాయిలతో కలిపి ఒకేసారి చెల్లిస్తే మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని ఈమేరకు జీవో నంబరు 35 పేరిట ప్రిన్సిపల్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి విడుదల చేశారు. 15వ ఆర్థిక సంఘంకు సంబంధించి మునిసిపాల్టీల ఆస్తిపన్నును పూర్తిస్థాయిలో వసూళ్లు చేసేందుకు ఈ రాయితీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. గత ఏడాది కూడా ఇటువంటి రాయితీని ప్రభుత్వం ఇచ్చిందని అధికారులు తెలిపారు. ఈ అవకాశం ఈనెల 31వ తేదీ వరకు ఉంటుందని, యజమానులు వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఈ జీవో విడుదలకు ముందు వడ్డీలు చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో వడ్డీని ఆస్తిపన్ను నుంచి తగ్గిస్తామని జీవోలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో ఉపాధ్యాయ సంఘ నాయకుల నిరసన

ఇరగవరం, ఫిబ్రవరి 29 : ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్, జిల్లా గౌరవ అధ్యక్షులు పీఎస్‌వీ ప్రసాద్, రాష్ట్ర పూర్వ కౌన్సిలర్ కోట రామ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కె రాంబాబు పాల్గొన్నారు.

ఫారెస్టు భూమిలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

▸▸ పట్టించుకోని రెవెన్యూ అధికారులు


గోపీనాథపట్నం ఫారెస్ట్‌లో తవ్విన మట్టి

ఉంగుటూరు, ఫిబ్రవరి 29 : ఉంగుటూ రు మండలంలోని గోపీనాథపట్నం, నాచుగుంట గ్రామాల ఆయకట్టులోని పంట భూములలో అనుమితి లేకుండా అటవీ భూమి, అనిశెట్టివారిచెర్వు (నాచుగుంట)లలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలను కొనసాగిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత వీర్‌వోలకు ఫోన్ చేసినా స్పందించకపోవడం గమనార్హం. దీనిపై రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోపీనాథపట్నం అటవీ భూములలో మండలంలోని మేజర్ పంచాయతీకి చెందిన ప్రజా ప్రతినిధి తన రాజకీయ పలుకుబడితో అనుమతి లేకుండా తవ్వకాలు సాగిస్తున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. వేసవి కాలం వస్తున్న సమ యంలో ఈ తవ్వకాలను మరింత వేగవంతంగా చేసేటట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> 'ఉచితవిద్య అంటూ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఎటువంటి స్పష్టత ఇవ్వకుండా ఇప్పుడు పీకమీద కత్తిపెట్టినట్టుగా తక్షణమే ఫీజు చెల్లించాలంటూ ఒత్తిడి తేవడం తగదు. అమ్మఒడి డబ్బులు అందరికీ ఇచ్చారుకదా. పేదకుటుంబాల పిల్లలకంటూ, విద్యాహక్కు చట్టంకింద ప్రైవేటు పాఠశాలల్లో ఉచితవిద్యకు అడ్మిషన్లంటూ ఆర్భాటంచేసి ఇప్పుడు ఫీజులు కట్టాల్సివస్తే మాకు అందుబాటులోవున్న స్కూళ్లలోనే పిల్లలను చేర్పించుకునే వాళ్ళం. నిన్న సాయంత్రం చెప్పి ఈరోజే ఫీజు చెల్లించాలంటే వేల రూపాయలు ఎక్కడినుంచి తేగలం ?' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఏలూరు ఎడ్యుకేషన్

ఇదేం ఉచిత విద్య !?



అమ్మఒడి డబ్బుల నుంచి ఫీజులు కట్టుకోవాలని ప్రభుత్వ సూచన

▸▸ ముందే చెబితే అడ్మిషన్లు వదులుకునే వారమని తల్లిదండ్రుల ఆగ్రహం

ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్లను పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఈవిధంగా అడ్మిషన్ పొందిన ఓ బాలుడి తల్లి గురువారం ఏలూరు డీఈవో కార్యాలయానికి వచ్చి తమ కుమారుడు చదువుతున్న ఓ ప్రైవేటు స్కూలు యాజమాన్యం నుంచి ఫీజు చెల్లింపు నిమిత్తం వచ్చిన ఫోన్ కాల్ గురించి కార్యాలయ సిబ్బందికి చెప్పగా ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుసుకుని తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని బహిరంగంగానే వ్యతిరేకించింది. వాస్తవానికి ప్రభుత్వ ఆకస్మిక నిర్ణయంతో ఉచిత అడ్మిషన్లు పొందిన బాలల తల్లిదండ్రులందరూ ఇదేరకమైన విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం కోటా సీట్లకు ఉచిత అడ్మిషన్లు పొందిన వారిలో పట్టణ ప్రాంత కుటుంబాల వారైతే రూ.8 వేలు, గ్రామీణ ప్రాంత కుటుంబీకులైతే రూ.6500, ఏజెన్సీ కుటుంబాల వారైతే రూ.5100 ఫీజును సంబంధిత పాఠశాలల యాజమాన్యాలకు చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం తేల్చిచెప్పింది. వాస్తవానికి తొలుత జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్నారేతప్ప విద్యార్థి తల్లిదండ్రులే అమ్మఒడి నగదు సాయంనుంచి చెల్లించాలని ఎక్కడా స్పష్టం చేయలేదు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంకింద అడ్మిషన్లు పొందిన వారికి ఉచితంగానే విద్యను అందజేయాలని, ఫీజులను ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు రీయింబర్స్‌మెంట్ చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనికి భిన్నంగా అమ్మఒడి డబ్బుల నుంచి ఫీజులను చెల్లించుకోవాలని ప్రభుత్వం చేతులెత్తేయడంపై సర్వత్రా అభ్యంతరాలు వస్తున్నాయి.

జిల్లాలో 83మంది విద్యార్థులు

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీనవర్గాల కుటుంబాల వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణప్రాంతాల వారికైతే రూ.1.40 లక్షలు ప్రాతిపదికన అర్హులను నిర్ణయించారు. పలుమార్లు ప్రకటనలు ఇచ్చిన తర్వాతకూడా ఈ స్కీంకింద ఏలూరు జిల్లాలో తగినన్ని దరఖాస్తులు అందలేదు. చివరకు జిల్లా మొత్తం మీద 44 ప్రైవేటు పాఠశాలల్లో కేవలం 83 మంది బాలబాలికలు ఒకటో తరగతిలో 2022-23 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం కూడా ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో గడిచినేడాదికి ఫీజు చెల్లించాలని ఇప్పుడు ప్రభుత్వం హుకుం జారీచేయడాన్ని విద్యార్థుల తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలందరికీ అమ్మఒడి డబ్బులిచ్చి, కేవలం ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంకింద అడ్మిషన్లు పొందిన వారి నుంచి ఫీజు వసూలు చేయాలని ఆదేశాలు జారీచేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని నోటిఫికేషన్ సమయంలోనే ప్రస్తావిస్తే తమకు అందుబాటులో వున్న పాఠశాలల్లోనే చేర్చుకునే వారమని చెబుతున్నారు. ఈ ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు అయితే ఇచ్చారు గాని మిగతాఖర్చులైన పుస్తకాలు, వ్యాన్ చార్జీల రూపేణా వేలాది రూపాయలు ఖర్చులు తప్పలేదని వాపోతున్నారు.

ఇప్పటికి ఫీజు చెల్లించింది 31మందే

గత విద్యాసంవత్సరానికి ఉచిత అడ్మిషన్లు పొందిన 83 మంది బాలల తల్లిదండ్రులు సంబంధిత ప్రైవేటుస్కూలులో చెల్లించిన ఫీజు రశీదులను ఆయా మండలాల ఎంఈవోలకు అందజేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ వెంటనే ఎంఈవో కార్యాలయాల నుంచి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు, అక్కడి నుంచి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు వెళ్లాయి. గురువారం సాయంత్రానికల్లా ఫీజు చెల్లించినట్టుగా రశీదులను తమకు అందజేయాలని, లేనిపక్షంలో స్కూలులో టీసీలు ఇచ్చి పంపేస్తామని బెదిరింపులకు కొన్ని పాఠశాలల యాజమాన్యాలు దిగాయి. ఈ నేపథ్యంలో పలువురు తలిదండ్రులు అకస్మాత్తుగా వేలాది రూపాయలు ఎక్కడినుంచి తీసుకువస్తామని, అసలు ఉచిత విద్య, అడ్మిషన్లంటూ ఊదరగొట్టిన ప్రభుత్వం ఫీజులు తమనుంచి వసూలు చేసేటట్టయితే ముందుగానే తెలియజేసి ఉండాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రానికి జిల్లాలో 31మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజుచెల్లింపు రశీదులను అందజేశారు. దీనిపై సమగ్రశిక్ష కార్యాలయ వర్గాలను వివరణ కోరగా 'అమ్మఒడి నగదు సాయంనుంచి ఫీజును కట్టుకోవాలని ప్రభుత్వం తల్లిదండ్రులకు సూచించింది. ఫీజుల చెల్లింపుపై కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కోర్టుని ఆశ్రయించడంతో ప్రభుత్వం ఈవిధంగా స్పష్టతనిచ్చింది. రాగల రెండు, మూడురోజుల్లో సంబంధిత పాఠశాలల్లో ఫీజుని చెల్లించి రశీదులను ఎంఈవో కార్యాలయాల్లో అందజేయాలి.' అని వివరించాయి.

6న పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

▸▸ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో షెడ్యూల్‌లో మార్పు ▸▸ ఒంగోలు, కొండేపిలో ప్రారంభమైన కొనుగోళ్లు

▸▸ ప్రారంభ ధర గరిష్ఠంగా రూ.230 ▸▸ ప్రారంభ ధరపై ఆనందం వ్యక్తం చేస్తున్న రైతాంగం

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 29 : వర్జీనియా పొగాకు కొనుగోలు ప్రారంభాల షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కోడ్ కూయకముందే వేలం కేంద్రాలు ప్రారంభించాలనే ఉద్దేశ్యంతో షెడ్యూల్ ప్రకారం మార్చి 14న తెరుచుకోవలసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాలు ఈనెల 6వ తేదీనే తెరుచుకోనున్నాయి. ఇది ఇలా ఉండగా గురువారం ఒంగోలు, కొండేపి వేలం కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమయ్యాయి.

● వర్జీనియా పొగాకు రైతులకు మరోసారి కలసి రానుందా ? గతేడాది మాదిరిగా మార్కెట్ పుంజుకోనుందా.. గిట్టుబాటు ధరలతో మార్కెట్ హోరెత్తనుందా? అంటే ఒంగోలు, కొనుగోలు ప్రారంభ ధరలు చూస్తుంటే అవుననే రైతులు చెబుతున్నారు. 75 ఏళ్ల పొగాకు చరిత్రలో గత సీజన్‌లో రికార్డు స్థాయిలో ధరలు నమోదయ్యాయి. ఏకంగా గరిష్ట ధర రూ.288 నమోదై ఆల్‌టైం రికార్డును సృష్టించింది. మార్కెట్ బాగుండడంతో రైతులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూడా మార్కెట్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. తాజాగా గురువారం రాష్ట్రంలో కొండేపి, ఒంగోలు-1 పొగాకు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల మొదలవ్వగా అక్కడ ప్రారంభ ధర చూసి ఇక్కడ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొదటి రోజు రెండు వేలం కేంద్రాల్లో ఒక్కో కేంద్రంలో 18 బేళ్లను కొనుగోలుకు పెట్టగా గరిష్ఠంగా కేజీ పొగాకు ధర రూ.230 నమోదైంది. గతేడాది ఈ ప్రాంతంలో ప్రారంభ ధర కేజీ రూ.160లతో ప్రారంభం కాగా అది క్రాసా కొనుగోలు ముగించే సమయానికి ఏకంగా రూ.288కు చేరింది. ఇప్పుడు ప్రారంభ ధర రూ.230 ఉండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గతేడాది కేజీ పొగాకు గరిష్ఠంగా రూ.210 ఉండగా కొనుగోలు ముగించే సమయానికి కేజీ పొగాకు రూ.288లతో ఆల్‌టైం రికార్డు నమోదు చేసుకుంది. ఒకప్పుడు ఏమీ లేనివారికి కనకవర్షం కురిపించిన పొగాకు మధ్యలో కొన్ని సీజన్‌లు అప్పులు పాలు చేసింది. ఆ సమయంలో చాలామంది రైతులు అధికంగా కౌలు రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుని పొగాకు సాగుకు స్వస్తి పలికారు. గత రెండు సీజన్‌లలో మార్కెట్ ధరలు బాగుండడంతో కొంత ఉపశమనం పొందారు. ఈ ఏడాది ఎన్‌ఎల్ఎస్ ప్రాంతంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో పొగాకు చేళ్లన్నీ ఇసుక తిప్పలుగా మారాయి. దాదాపు వందల వేల ఎకరాల్లో పొగాకు మొక్కలను తొలగించి మళ్లీ సాగు ప్రారంభించారు. మొదట పెట్టిన పెట్టుబడులు తుఫాన్ మింగేసింది. తుఫాన్ తరువాత ఒక్కసారిగా పొగాకు నారు పది రెట్లు అవ్వడంతో చేసేంది లేక రైతులు ధైర్యంగా సాగుకు దిగారు. పెట్టుబడులు అమాంతం పెరిగిపోయాయి. గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా ధరలు బాగుంటేనే రైతులు గట్టెక్కేది లేకుండా గతేడాది మిగులు కూడా చేజారే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఒంగోలు, కొండేపి వేలం కేంద్రాల్లోని ప్రారంభ ధర కాస్త ఉపశమనం ఇస్తున్నాయి.

రెండు దశలు 6 నుంచే..

పొగాకు కొనుగోలు ప్రారంభాల్లో మార్పు సంభవించాయి. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 29న ఒంగోలు-1, కొండేపి, రెండో దశలో మార్చి 6న కందుకూరు-1, కందుకూరు-2, వెల్లంపల్లి బోర్డు పరిధిలో, మూడో దశలో ఒంగోలు-2, టంగుటూర్, కలిగిరి, డీసీ పల్లి, కనిగిరి, పొదిలి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1, జంగారెడ్డిగూడెం-2 బోర్డుల పరిధిలో వేలం ప్రారంభం కావలసి ఉంది.

జీడి తోటల తొలగింపు అన్యాయం

▸▸ కొంతమంది బంధంచర్ల గ్రామస్థుల ధర్నా


ఎక్స్‌కవేటర్‌తో జీడి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

టి.నరసాపురం, ఫిబ్రవరి 29 : పూర్వకాలం నుంచి భూమిలో ఉన్న జీడితోటల ఫలసాయమే జీవనాధారంతో జీవించే జీడితోటలను యంత్రాలతో తొలగించారని ఆరోపిస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బంధంచర్లకు చెందిన కొంతమంది గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన బేతి శేషయ్య, జాను, మరికొంత మంది ఆందోళన వ్యక్తం చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బంధంచర్లలోని తమ భూమిలో జీడితోటలను నమ్ముకుని ఏళ్లపాటు జీవనం సాగిస్తున్నామన్నారు. సుమారు 40 ఏళ్ల నుంచి ఈ భూమిపై కోర్టు తగాదా నడుస్తుందన్నారు. ఈ క్రమంలో గురువారం పోలీసుల సహకారంతో అధికారులు జీడిచెట్లను తొలగించారన్నారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ సుభాశ్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం భూమిపై హక్కు గల కుటుంబసభ్యులకు భూమిని అప్పగించాలని గత తహసీల్దార్ సుబ్బారావు ఆ భూమిని స్వాధీనం చేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఇదే విషయంపై ఎస్ఐ దుర్గామహేశ్వరరావును వివరణ కోరగా తహసీల్దార్ భూమిపై హక్కు ఉన్న వారికి రక్షణ కల్పించాలని ఆదేశాలు ఇవ్వడంతో అక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో జనసేన అభిమాని మృతి

▸▸ వివాహమైన ఆరు రోజులకే దుర్మరణం


అంజిబాబు (ఫైల్)

మొగల్తూరు, ఫిబ్రవరి 29 : మండలంలోని కొత్తోటకు చెందిన పవన్‌కల్యాణ్ అభిమాని ఏనుగుల అంజిబాబు(30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తాడేపల్లిగూడెంలో బుధవారం నిర్వహించిన జనసేన, టీడీపీ ఉమ్మడి జెండా సభకు వెళ్లిన అతడు సభ ముగిసిన అనంతరం అతడి స్నేహితుడు పిలుపుమేరకు జంగారెడ్డిగూడెం వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి కొత్తోట వస్తుండగా గోపాలపురం పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతుడి తండ్రి చక్రపాణి అంధుడు కావడం, తల్లి మానసిక వైకల్యం కావడంతో పాలకొల్లులోని మెడికల్ షాపులో పనిచేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆరు రోజుల క్రితమే వివాహమైన అంజిబాబు మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంజిబాబు మృతికి జనసైనికులు సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

లింగపాలెం, ఫిబ్రవరి 29: ఓ యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తువ్వచిలుక రాయుడుపాలెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన నత్తా తిరుమలరావు(21)అనే యువకుడు గత నెల 26వ తేదీ ఉదయం తన ఇంటివద్ద వాంతులు చేసుకుంటుండగా అమ్మమ్మ గమనించి విషయం అడగడంతో పురుగులమందు తాగినట్టు యువకుడు తెలిపాడు. వెంటనే స్థానికుల సాయంతో లింగపాలెంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువకుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించినట్టు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. మృతుడికి చిన్నత నంలోనే తండ్రి చనిపోవడంతో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

డిపాజిట్ సొమ్ములు ఇవ్వలేదని చీటింగ్ కేసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 29:డిపాజిట్ సొమ్ములు తిరిగి ఇవ్వకుండా మోసగించిన వారిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన డేగా వాణి 2011లో అభయా గోల్డ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్‌లో డిపాజిట్లు చేశారు. వాటి గడువు తీరినప్పటికి ఇవ్వకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు విజయవాడలోని ఏలూరు రోడ్డులో ఉన్న అభయ గోల్డ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్ దాని ప్రతినిధులుగా ఉన్న కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన సుంకర దుర్గారావు, అతని భార్య సుంకర రమాదేవిలపైఫిర్యాదు చేశారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం చీటింగ్ కేసు నమోదు చేసి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో మోసగించిన వ్యక్తిపై కేసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 29 : ఒక ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకుని గడువు పూర్తయినప్పటికీ మళ్లీ నకిలీ డాక్యుమెంట్లతో అగ్రిమెంట్ జరిగినట్టుగా సృష్టించిన ఓ వ్యక్తిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు సమీపంలోని శనివారపుపేట రోడ్డు శాతవాహననగర్ లయన్స్ క్లబ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అట్లూరి దుర్గానాగేశ్వరరావు కుమార్తె రమాదేవి అమెరికాలో ఉంటున్నారు. వీరికి శనివారపుపేటలో వున్న ఖాళీ స్థలాన్ని 2019లో బాపులపాడు మండలం పెదగయ కొయ్యేరుకు చెందిన గోగినేని నరసింహారావుకు లీజుకు ఇచ్చారు. నెలవారీ అద్దె చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. నరసింహారావు ఆ ఖాళీ స్థలంలో శ్రీస్వర్ణమిల్క్ అండ్ ఫుడ్ ప్రాసెస్ పేరుతో వ్యాపారం చేస్తున్నారు. లీజు గడువు తీరిన తరువాత ఖాళీ చేయాలని నాగేశ్వరరావు పలుమార్లు చెప్పినప్పటికీ కాలయాపన చేస్తూ అక స్మాత్తుగా నకిలీ అగ్రిమెంటు సృష్టించాడు. అట్లూరి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు నరసింహారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ముసునూరు, ఫిబ్రవరి 29:కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేశామని ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. వలసపల్లి గ్రామానికి చెందిన మల్లినేని సురేష్(38) కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తుట్టుకోలేనంత కడుపునొప్పి రావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు సురేష్‌ను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అప్పటికి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

తిరుపతిపాడు రామాలయంలో చోరీ

టి.నరసాపురం, ఫిబ్రవరి 29: తిరుపతిపాడు రామాలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్టు స్థాని కులు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఫిబ్రవరి 26వ తేదీన సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని హుండీలో సుమారు లక్ష రూపాయలు నగదు అమ్మవారి మెడలోని బంగారు వస్తువులు చోరీకి గురైనట్టు వారు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. ఆరుగురిపై కేసు

ముసునూరు, ఫిబ్రవరి 29: నగదు లావాదేవీలపై ఇరువర్గాల మధ్య జరిగిన పరస్పరదాడుల ఘటన నేపథ్యంలో ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.వాసు తెలిపారు. కాట్రేనిపాడుకు చెందిన పేరిచర్ల ఆంజనేయులు అనే వ్యక్తి ఆదే గ్రామానికి చెందిన పేరిచర్ల రంగారావుకు వ్యవసాయ ఖర్చుల నిమిత్తం కొంత నగదు ఇచ్చాడు. ఆంజనేయులు డబ్బులు ఇవ్వమని అడుగుతుంటే రంగరావు డబ్బులు ఇచ్చేపనిలేదు అంటూ ఘర్షణకు దిగాడు. గురువారం ఇరువర్గాల వారు పరస్పర దాడులు చేసుకున్నారు. దాడుల్లో గాయపడ్డ ఆంజనేయులు, రంగరావు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు ఇరువర్గాలకు చెందిన ఆరుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వాసు తెలిపారు.


నూతనంగా విధుల్లో చేరుతున్న ఉద్యోగులు

నిబంధనలు బేఖాతర్ !

▸▸ పశుసంవర్ధక శాఖలో ఇష్టారాజ్యంగా అధికారులు

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 29: ప్రభుత్వ నిబంధనలు బేఖాతార్, అధికారుల ఇష్టారాజ్యం, వైసీపీ నాయకులు చెప్పిందే ఫైనల్.. ఇదీ పశుసంవర్ధక శాఖ అధికారుల తీరు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లను ప్రభుత్వం 95మందిని ఎంపిక చేసింది. వారికి ఏలూరు పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపత్రాలను అందజేశారు. జిల్లాలో ఉన్న ఖాళీలను అభ్యర్థులకు తెలపకుండా బహిర్గతం చేయకుండా అధికారులు ఇష్టారాజ్యంగా తమకు నచ్చిన వారికి కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టింగులు ఇచ్చారు. ఈ నియామకపత్రాలు అందజేసే క్రమంలో లంచాలు తీసుకున్నట్టు కొంతమంది అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు, ప్రముఖ నాయకుల నుంచి సిఫారసులు రావడంతో నిబంధనలను తుంగలో తొక్కి వారు సూచించిన అభ్యర్థులకు కావాల్సిన చోట్ల పోస్టింగులు ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశుసంవర్ధక శాఖలో ఇవేమి కొత్తకాదని వారం రోజుల క్రితం యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లను వెటర్నరీ అసిస్టెంట్లుగా 28 మందికి ప్రమోషన్లు ఇచ్చారు. ఇక్కడ కూడా ఇదే తంతు జరిగిందని వార్తలు వస్తున్నాయి. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.3-5 వేల వరకు లంచాలు తీసుకుని పోస్టింగులు ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని నూతనంగా ఉద్యోగాలు పొందిన కొంతమంది అభ్యర్థులు, ప్రమోషన్లు పొందినవారు కోరుకుంటున్నారు.

మావుళ్ళమ్మ సన్నిధిలో హైకోర్టు జడ్జి పూజలు


జస్టిస్ శేషసాయికి అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ధర్మకర్తలు

భీమవరంటౌన్, ఫిబ్రవరి 29 : మావుళ్ళమ్మ అమ్మవారిని హైకోర్టు జడ్జి జస్టిస్ ఆకుల శేషసాయి కుటుంబ సభ్యులతో కలసి గురువారం సాయంత్రం పంచహారతుల సమయంలో దర్శించుకున్నారు. దేవస్థానం తరపున ఆయనకు స్వాగతం పలికారు. అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ప్రసాదాన్ని, అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని అందించారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్, ధర్మకర్తల ఛైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు చెల్లంకి నాగేశ్వగిరి, ముత్యాల రామారావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, కోయ వెంకట లక్ష్మీతదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి నిత్యవిద్యానంద భారతీస్వామి పూజలు


ఆలయంలో స్వామీజీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 29: ద్వారకాతిరు మల చినవెంకన్న స్వామిని ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిప తులు నిత్యవిద్యానంద భారతీస్వామి దర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకుల నుంచి శ్రీవారి ప్రసాదాలను అందుకున్నారు.

సర్పంచ్‌ల సమస్యలపై కలెక్టరేట్ వద్ద రేపు ధర్నా

కొవ్వూరు, ఫిబ్రవరి 29: సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 2న ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణ రావు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏలూరు కలెక్టరేట్ వద్ద స్థానిక సంస్థలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలు, సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని, 16 డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఈ ధర్నాలో రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొనాలని కోరారు.

వేర్వేరుచోట్ల పది మంది జూదరుల అరెస్ట్

ముదినేపల్లి/ముసునూరు, ఫిబ్రవరి 29 : జిల్లాలో వేర్వేరుచోట్ల మొత్తం పది మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ముదినేపల్లి మండలం పేరూరులో గురువారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఎనిమిది మంది జూదరులను ముదినేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో పేకాట సమాచారం అందుకున్న ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పోలీసు సిబ్బందితో దాడి చేసి వారి నుంచి రూ.27 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ముసునూరు మండలంలోని గోపవరం శివారు నాగేంద్రపురం సెంటర్ వద్ద గురువారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ముసునూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు జూదరులను అదుపులోకి తీసుకుని, వారివద్ద నుంచి రూ. 400, 52 ప్లేయింగ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

జిల్లా స్థాయి సైన్స్ ఎక్స్‌పో విజేతలు వీరే


విజేతలతో జిల్లా సైన్స్ ఆఫీసర్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29 : జిల్లాస్థాయి సైన్స్ ఎక్స్‌పో-2024 పోటీలు శనివారపుపేట జడ్పీ హైస్కూలులో గురువారం జరిగాయి. 106 ప్రాజెక్టుల నుంచి మూడు ప్రదర్శనలను ఎంపికచేసి బహుమతులు అందజేశారు. బొ్రంపాలెం, రాచూరు, కేశవరం జడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని జిల్లా సైన్స్ ఆఫీసర్ సీహెచ్‌ఆర్‌ఎం చౌదరి, సమగ్రశిక్ష ఏఎంవో ఆర్.రామారావు తెలిపారు. వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ) కింద సైన్స్ ఎక్స్‌పో నిర్వహించినట్టు వివరించారు. ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఎం.వెంకటరమణ, స్కూల్ హెచ్‌ఎం ప్రకాష్, జయశుభ తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం : బొ్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు రాష్ట్రస్థాయి ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలెప్మెంట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎండి ఆలీ తెలిపారు. మార్చి 6న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వక్తృత్వ పోటీలో కైకరం విద్యార్థిని జాహ్నవి ప్రథమం


ప్రథమ బహుమతి అందుకున్న జాహ్నవి

ఉంగుటూరు, ఫిబ్రవరి 29: వైస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన వక్తృత్వ పోటీలలో కైకరం విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించింది. '2047 దేశ భవిష్యత్తును మార్చడం'పై బహిరంగ చర్చలో 150 మంది విద్యార్థులు పాల్గొనగా కైకరం గ్రామానికి చెందిన కూన పద్మ జాహ్నవి ప్రథమ స్థానం పొందింది. అసోసియేట్ డీన్ మాధవి, విద్యార్థి వ్యవహారాల డీన్ డీఆర్.సలోమీ, తను బుద్ది భోగేశ్వరరావు, శివకుమార్, ఉదయశ్రీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

తూనిక, కొలతల అధికారుల తనిఖీ


తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 29: తూనిక, కొలతల చట్టాలను ఉల్లంఘించిన వ్యాపారులపై అధికారులు కేసులు నమోదు చేశారు. తూనికల, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ బీవీ.హరిప్రసాద్ గురువారం వివరించారు. ప్యాకేజీ కమోడిటీస్ రూల్స్ ఉల్లంఘనలో 10 కేసులు, తక్కువ తూకపు ప్యాకేజీ ఉల్లంఘనపై ఒక కేసు, అధిక ధరల విక్రయాలపై 3, ముద్రలు లేని పరికరాలపై 10కేసులు నమోదయ్యాయి. బియ్యపు షాపులపై 7 కేసులు, ఐరెన్ అండ్ స్టీలు ట్రేడర్స్‌పై 14కేసులు, బస్టాపుల్లో అధిక ధరలకు విక్రయించే వారిపై 4 కేసులు, ఆక్వా షాపుపై ఒక కేసు నమోదు చేసినట్లు హరి ప్రసాద్ తెలిపారు. జాయింట్ కంట్రోలర్ సుధాకర్ ఆదేశాలతో విజయవాడ జోన్, ఏలూరు జోన్‌లో తనిఖీ చేశారు. విజయవాడ డీసీ ఏ.కృష్ణచైతన్య, ఏసీలు ఈశ్వరరావు, నాగరాజారావు, రాజేంద్రప్రసాద్, టీకే.కుమారి, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకరరావు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 29: ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలని, కూలీలకు పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, మండల కార్యదర్శి ఎ.ప్రభాకరరావు పాల్గొన్నారు. ఉపాధి పనుల్లో కూలీలకు మండలంలో రూ.40లక్షల వరకు బకాయిలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సుబ్బారావు, గరికిపాటి రాంబాబు, వి నరసరావు, సీత, పిల్లి చంటి, కలపాల వెంకటేష్, సిహెచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళా ప్రదర్శనలు


చేబ్రోలులో జానపద కళా ప్రదర్శనలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 2: జాతీయ ఎయిడ్స్ నియంత్రణపై గురువారం చేబ్రోలులో కళా ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. జాగ్రత్తలు, నివారణపై ఏలూరుకు చెందిన కీర్తన కల్చరల్ సొసైటి కళాకారులు వీధి నాటికను ప్రదర్శించారు. ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రాంధే లక్ష్మీ సునీత చైల్డ్ ఫండ్ ఇండియా సభ్యులు, టీబీ, క్షయ వ్యాధి నివారణకు సూచనలు చేశారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి


పల్స్‌పోలియోపై అవగాహన కార్యక్రమం

లింగపాలెం, ఫిబ్రవరి 29: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకిషోర్ పిలుపునిచ్చారు. గురువారం వ్యాక్సినేటర్లతో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ మార్చి 3న ప్రత్యేక శిబిరాల్లో ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వైద్యసిబ్బందితో పాటు ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలన్నారు. రంగాపురంలో వైద్యసిబ్బందితో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అబేదా, ఆరోగ్యవిస్తరణ అధికారి అబ్రార్ హుస్సేన్, ఉమామహేశ్వరరావు, రాణి, విష్ణుమూర్తి, చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.కృష్ణకిషోర్ పిలుపునిచ్చారు. ప్రగడవరంలో గురువారం వ్యాక్సినేటర్లతో అవగాహన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రులు, గ్రామాల్లో పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రగడవరంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

జీలుగుమిల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నేతలు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 29: బడుగు బలహీన వర్గాల్ని రాజ్యాధికారం దిశగా తీసుకెళ్లాలని తెలుగు వారి ఆత్మగౌరవం కాపాడడానికి నిరంతరం కృషి చేసిన ఎన్టీర్ చిరస్మరణీయుడని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. జీలుగుమిల్లిలో గన్నమని బాలరాజు కాంప్లెక్స్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని పలువురు సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బొరగం గురువారం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఎన్టీర్ ఆశయాల్ని సాధించేందుకు రాబోయే ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు పార్టీని గెలిపించేందుకు కష్టపడి పనిచెయ్యాలన్నారు. పారేపల్లి రామారావు, మండవ లక్ష్మణరావు, జయవరపు శ్రీరామూర్తి, దాసరి శ్యామ్‌సుందరశేషు, మొడియం శ్రీనివాస్, చిర్రి వెంకటేశ్వరావు, మొడియం సూర్యచంద్రం, బాసిన రాజబాబు, గన్నమని సతీష్, గన్నమని శివ, కొర్లపాటి సునీల్, గూడపాటి అరుణ్, తమ్మన సాంబ, బుడిపూటి చిరంజీవి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు కొందరు నాయకులు హాజరుకాకపోవడంతో పార్టీలో వర్గ పోరు బయటపడింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతలు విగ్రహావిష్కరణ వద్ద కన్పించలేదు. టీడీపీ మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి, సీనియర్ నాయకులు ఉండవల్లి సోమసుందరం, మరి కొందరు హాజరు కాలేదు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం టి.నరసాపురం నుంచి వచ్చే కొందరు నాయకులు కూడా రాలేదు. పార్టీ సమస్యలపై పలువురు సీనియర్ నేతలు కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌తో చర్చించారు.

తాటాకిల్లు దగ్ధం

టి.నరసాపురం, ఫిబ్రవరి 29 : మర్రిగూడెంలో షార్ట్ సర్క్యూట్‌తో గురువారం తాటాకిల్లు దగ్ధమైంది. కురసం వెంకటేశ్వరరావు దంపతులు పొలం పనులకు వెళ్లడంతో ఇంటి వద్ద ఎవరూ లేరు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడటంతో అదుపు చేయడానికి స్థానికులు ప్రయత్నించినప్పటికీ ఇళ్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.3.5 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా.





ఏలూరు, జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా


పాఠశాల విద్య అదనపు డైరెక్టర్‌కు వినతిపత్రం


ఏలూరులో భవన నిర్మాణ కార్మికుల ధర్నా

టీచర్ల పోరాటం

తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ ధర్నా

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 29: సమస్యల పరిష్కారం కోరుతూ టీచర్లు పోరు బాట పట్టారు. ఏపీటీఎఫ్ పిలుపులో భాగంగా 30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని, డీఏ బకాయిలు చెల్లించి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు, జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు, కార్యదర్శి డీకేఎస్ఎస్ ప్రకాశరావు తదితరులు మాట్లాడారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా ఉన్న 117 జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ నియామకాల్లో ప్రవేశపెట్టిన అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్, ఏపీ జీఎల్ఐ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.ఆనంద్‌కుమార్, ఏ.దాసరి శ్రీనివాస్, రామశేషు, కార్యదర్శి శ్రీనివాస్, కృష్ణారావు, కొండయ్య, రమాదేవి, సుహాసిని, సుజాత, రత్నకుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డిదొర డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులంతా ఉద్యమాల్లో పాల్గొని సంఘాలకు సహకరించాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ పాత విధానంలో అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ కొనసాగించాలని, పెండింగ్ డీఏ లను వెంటనే విడుదల చేయాలని, నూతన డీఏలను ప్రకటించాలన్నారు. అనంతరం తహసీల్దార్ స్లీవజోజికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి యువీఎస్ రాజు, పీవీఆర్ రాజ్యలక్ష్మి, కె.త్రివేణి, ఏపీటీఎఫ్ జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై చర్చలు

ఏలూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ పి.పార్వతితో రాష్ట్ర కార్యాలయంలో చర్చించారు. వివరాలను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గురువారం తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57 ప్రకారం రాష్ట్రంలో డీఎస్సీ-2003 టీచర్లకు పాతపెన్షన్ విధానాన్ని వెంటనే అమలుచేయాలని కోరామన్నారు. సరెండర్ లీవు బిల్లులు, ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐకి సంబంధించిన బిల్లులు ఇంతవరకు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని, తక్షణమే నిధులు జమ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీ-2024కి అప్రంటీస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. పాఠశాలల విలీనానికి సంబంధించిన టీచర్ల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు 117 జీవో రద్దుచేసి, గతంలో వున్న జీవో 53ప్రకారం ఉపాధ్యాయ పోస్టులను కేటాయించాలని అభ్యర్థించామన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, 12,14 మెమో రద్దు చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు యర్రా రాంబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేశారని, సీఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్లో కోత పెట్టారని మండిపడ్డారు. 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెల్ఫేర్ బోర్డును ఏలూరును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేశారని, కాని జగన్మోహన్‌రెడ్డి అన్యాయం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ పథకాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. బి.జగన్నాధరావు, పరసా శ్రీను, కె.రెడ్డిరాజా, ఎస్.కె బాష, ఆకుల దుర్గారావు, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కలరాయనగూడెంలో టీడీపీ నేతలతో సొంగా రోషన్‌కుమార్


లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన ఏలూరు వైసీపీ శ్రేణులు

టీడీపీ, జనసేన కూటమి విజయం ఖాయం : రోషన్

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 29: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం ఖాయమని చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పుట్లగట్లగూడెంలో గురువారం ఆయన జనసేన, టీడీపీ నాయకులను కలుసుకున్నారు. ప్రతి ఒక్కరినీ పరిచయం చేసుకుని కష్టపడి పార్టీ కోసం పని చేయాలని సూచించారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా బహిరంగ సభను చూసి వైసీపీకి భయం పట్టుకుందన్నారు. తాడేపల్లిగూడెం సభ విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడి వలనే సాధ్యమన్నారు.

● లింగపాలెం: కలరాయనగూడెంలో కార్యకర్తలతో టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, నందిగం బాబి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో సొంగా రోషన్‌కుమార్ సమావేశమయ్యారు. పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలందరూ కృషిచేయాలన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగాధర్, నందిగం శ్రీధర్, వీరయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ధర్మాజీగూడెం సాయిబాబా ఆలయంలో రోషన్ కుమార్, టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

● కామవరపుకోట: టీడీపీ, జనసేన కూటమికి అపూర్వ ప్రజాదరణ వస్తుందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ అన్నారు. పాతూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాడేపల్లిగూడెం సభకు అంచనాకు మించి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం ఖరారైందని, ఎన్నికలు రావటమే తరువాయి అన్నారు. గోరింక దాసు, పసుమర్తి పార్థసారధిబాబు, గూడపాటి కేశవరావు, జిజ్జూరి బాబ్జీ, రవి, వందనపు మురళీ, బచ్చు వీర వెంకట ముత్యాలరావు తదితరులు ఉన్నారు.

● పెదవేగి: తాడేపల్లిగూడెం సభతో తాడేపల్లి ప్యాలెస్ వణుకుతోందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు గజగజలాడుతున్నారన్నారు. దొంగల పార్టీ వైసీపీకి వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నాయని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కూటమి విజయం తథ్యమని ప్రభాకర్ పేర్కొన్నారు.

వైసీపీలో కనీస మర్యాద లేదు

ఏలూరు టూటౌన్: వైసీపీలో కార్యకర్తలకు కనీస మర్యాద లేదని, అందుకే టీడీపీలో చేరుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. వైసీపీ కార్పొరేటర్లు కర్రి శ్రీనివాస్, పప్పు ఉమామహేశ్వరరావు, ముగ్గురు మాజీ కార్పొరేటర్లు కొలారి చంద్రశేఖర్, మాగంటి హేమసుందర్, తిలగల ప్రకాశ్ టీడీపీలో చేరారు. మరి కొందరు కార్యకర్తలను వెంటబెట్టుకుని విజయవాడలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఏలూరులో చంటి మాట్లాడుతూ జగన్ ఒక పెద్ద నియంత అయితే ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని జూనియర్ నియంత అన్నారు. రానున్న రోజుల్లో మరికొంతమంది కార్పొరేటర్లు, కార్యకర్తలు టీడీపీలోకి వలస వస్తారన్నారు. నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివ ప్రసాద్, డిప్యూటీ మాజీ మేయర్ చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

ఈవీఎంలపై కొండరెడ్లకు అవగాహన


కొండరెడ్లకు అవగాహన కల్పిస్తున్న పీవో

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 29: ఈవీఎంల పనితీరుపై గిరిజన ప్రాంతాల్లో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ కొండరెడ్లకు అవగాహన కల్పించారు. మారుమూల అటవీ ప్రాంతంలోని ముంజులూరులో గురువారం ఓటర్ల అవగాహన చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటుహక్కు వినియోగంపై ప్రతిఒక్కరిలో అవగాహన ఉండాలని, ఓటుహక్కును వినియోగించుకోవడం సామాజిక బాధ్యత అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్‌డీసీ రామారావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ గంగరాజు, సర్పంచ్ ముక్కారెడ్డి ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీలో దళితులకు విలువ లేదు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 29: వైసీపీలో దళితులకు విలువ లేదని దళిత నాయకులు పాకా ప్రభాకరరావు, పీజే స్టాలిన్ అన్నారు. షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టిక్కెట్ల కేటాయింపులో దళిత ఎమ్మెల్యేలనే మార్చారన్నారు. అగ్రవర్ణాల జోలికి ఎందుకు పోలేదని ప్రశ్నించారు. చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజాకు టిక్కెట్టు ఇవ్వకుండా అవమానపరిచారన్నారు. గతంలో ఉండవల్లి శ్రీదేవిని కూడా బయటకు పంపేశారని, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావుపై లేనిపోని ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారుల ప్రచారం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 29: ఏలూరులో జబర్దస్త్ కళాకారులు, సినీ గాయకుల బృందం గురువారం బీజేపీ తరపున ప్రచారం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గారపాటి సీతారామంజనేయ చౌదరిని (తపనా చౌదరి) ఎన్నుకుంటే అభివృద్ధి చేస్తారని సినీ గేయరచయిత అనంత శ్రీరామ్ అన్నారు. గారపాటి చౌదరి సొంత నిధులతో ఎన్నో సేవా కార్య క్రమాలు చేస్తున్నారన్నారు. బావిశెట్టి వారిపేట, సుంకర వారితోట, పోణంగి, శనివారపుపేటలో పర్యటించారు. కార్యక్రమంలో నాగం శివ, గాది రాంబాబు, జ్యోతికుమార్, ముఖేష్, మహేష్, పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ అధికారిని కలసిన వీఏఏలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 29: జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన షేక్ షాబీబ్‌భాషాను గురువారం జిల్లా గ్రామ, వ్యవసాయ సహాయకుల సంక్షేమ సంఘం నాయకులు కలసి అభినందించారు. వీఏఏల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. టి.కుమార్, చక్రపు శివకుమార్, జి.బాలఅర్జున్, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

టి.నరసాపురం, ఫిబ్రవరి 29 : అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఏకశిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠ గురువారం నిర్వహించారు. నయనార్ల విగ్రహ ప్రతిష్ఠ, దీపస్తంభ ప్రతిష్ఠ, కార్యక్రమాలు వెలవలపల్లి బాల సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం అఖండ అన్న సమారాధన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు ఆలయ అన్నదాన కమిటీ సభ్యులు పసుమర్తి రాము, పర్వతనేని మురళి మాట్లాడుతూ శివ భక్తులు సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బాల సూర్యనారాయణ రాజు, కమ్మిల సురేష్ రాజు, దేవరపల్లి సీతారామయ్య, కన్నం సర్వేశ్వరరావు, నల్లూరి శ్రీనివాసరావు, నూతి రాంబాబు, బాలరాజు, మణికంఠ రాటాలు, భక్తులు పాల్గొన్నారు.

అంబికాదేవి ఆలయ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 29: సత్రంపాడు అంబికాదేవి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ ఏకాదశ ద్రవ్యాలతో అమ్మవారికి మహా పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మల్లికార్జునుడి సన్నిధిలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 29: శివనగర్ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన మందిరంలో గురువారం నవగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. నవగ్రహ మండపారాధన, జలాదివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసములు జరిపారు. స్వామివారికి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. అర్చకులు వి.వెంకటరత్నం శర్మ భక్తులతో పూజలు చేయించారు.

నేడు రామకోటిలో అనఘాష్టమి వ్రతాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 29: అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో శుక్రవారం అనఘాష్టమి వ్రతాలను నిర్వహిస్తున్నట్టు అర్చకులు రామకృష్ణ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం నెల్లూరుకు చెందిన భాగవతార్ పరాయితం నారాయణాచార్యులు సతీసుకన్య ఉపన్యాసాన్ని తెలిపారు. విజయవాడకు చెందిన మాధురి ఆర్కెస్ట్ర సింగర్ వీవీఏ.ప్రసాద్ భక్తగాన కచేరి నిర్వహించారు. మార్చి 17 వరకు ఉత్సవాలు కొనసాగుతాయి.

ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐకు సత్కారం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 29 : పోలీస్‌శాఖలో 42 ఏళ్లు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించిన ఎస్ఐ నాగేశ్వరరావు ఎటువంటి రిమార్కులు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. డీసీఆర్బీలో ఎస్ఐ కొక్కొండ నాగేశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నాగేశ్వరరావు, ఆయన సతీమణి లక్ష్మీ భ్రమరాంబను ఎస్పీ సన్మానించి జ్ఞాపికలను అందించారు. డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, సిబ్బంది, అడ్‌హాక్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

మురుగు.. దుర్గంధం

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం


జీలుగుమిల్లి వినాయక ఆలయం వద్ద మురుగు
(ఇన్‌సెట్) పి.రాజవరంలో పాఠశాల వద్ద పైపులైన్ లీకేజ్

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 29: గ్రామాలు అపారిశుధ్యంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. కొద్ది రోజులుగా గిరిజన గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరం తలనొప్పి, కీళ్ల నొప్పులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో మురుగునీరు పారేందుకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. పగలు ఈగలు, సాయంత్రం వేళ దోమలు ముసురుతున్నాయని మహిళలు గగ్గోలు పెడుతున్నారు. మలేరియా సమస్యాత్మక గ్రామాలకే దోమల మందు పిచికారీ పరిమితం చేశారు. మరోవైపు పంచాయతీ అధికారులు దోమల నివారణకు ఫాగింగ్ పేరుతో గ్రామాల్లో నెలరోజులకు ఒకసారి పొగ పెడుతున్నారు. తాగునీరు లీకేజీలు పట్టించుకుని మంచినీటి కాలుష్యాన్ని నివారించాలని ప్రజలు కోరుతున్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని పలువురు వాపోతున్నారు. జీలుగుమిల్లిలో వినాయక ఆలయం వద్ద మురుగునీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడే భారీ వృక్షాలు ఉండడంతో చెట్ల ఆకులు రాలి దుర్వాసనతో ఆ ప్రాంతం దోమలకు నిలయంగా మారింది. పి.రాజవరం రామాలయ సమీపంలో రహదారికి ఆనుకుని ఉన్న లీకేజిని పంచాయితీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. రాచన్నగూడెంలో సాయిబాబా ఆలయం సమీపంలో నెలల తరబడి లీకవుతున్న పైపులైన్ సరి చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. జీలుగుమిల్లి మీసేవ వద్ద రహదారిపై కుళాయి నీరు నిలిచిపోతోంది. రహదారిపై మురుగులో నుంచి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

సీనియర్ జర్నలిస్ట్ నాగ కుమార్ ఆకస్మిక మృతి


మృతదేహం వద్ద ప్రెస్‌క్లబ్ సభ్యుల నివాళి
(ఇన్‌సెట్) నాగ కుమార్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 29: పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.వి. నాగ కుమార్(54) ఆకస్మికంగా మృతి చెందారు. నాగకుమార్ బుట్టాయగూడెం విలేకరిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. అనంతరం ఎలక్ట్రానిక్ మీడియాలో పలు చానళ్లలో పనిచేశారు. ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లా శాఖ కోశాధికారిగా, సహాయ కార్యదర్శిగా, స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలందించారు. ఫ్రీలాన్సర్ అక్రిడిటేషన్ మంజూరు కాగా తెచ్చుకోవడానికి నాగకుమార్ బుధవారం విజయవాడ బస్ కాంప్లెక్స్ వాష్ రూమ్ వద్ద పడిపోయి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు. గురువారం జంగారెడ్డిగూడెంలో నాగకుమార్ నివాస గృహం వద్ద పార్థీవ దేహాన్ని పలువురు యూనియన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ, సిటీ కేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్, సిటీ డిజిటల్ నెట్వర్క్ ఎండి చిన్ని హరీష్ గుప్త, డీవీ.భాస్కరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు తదితరులు నాగకుమార్ పార్థివదేహాన్ని సందర్శించారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు.

● ఏలూరు సిటీ: నాగకుమార్ మృతికి డీపీఆర్వో ఆర్‌వీఎస్ రామచంద్రరావు, డివిజనల్ పీఆర్వో సీహెచ్ దుర్గాప్రసాద్ సంతాపం తెలిపారు.

విశాఖ పీఠాధిపతి జయరావుకు సత్కారం


జయరావుకు సత్కారం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 29: ఏలూరు కథోలిక పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర విశాఖపట్నం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సెక్రటరీ ఎలీషాకుమార్, సభ్యులు చిట్టిబాబు, భాస్కర్, ప్రకాశ్, భోగి, జయకుమార్, నారాయణ జయరావును ఘనంగా సన్మానించారు.

క్రికెట్ విజేత ఫ్రెండ్లీ ఫైటర్స్


చెక్కు అందజేస్తున్న చోడగిరి

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 29: స్నేహితుడు అకాల మరణంతో అతడి పేరిట ఏటా స్నేహాంజలి మెమోరియల్ సీజన్ పేరుతో స్నేహితులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఫ్యూచర్ ఇండియా, స్నేహాంజలి మెమోరియల్ సీజన్ 11 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు ఏలూరు అల్లూరిసీతారామ స్టేడియంలో గురువారం ఉత్సాహంగా జరిగాయి. ఫైనల్ పోటీలో కమాండో టీమ్, ఫ్రెండ్లీ ఫైటర్స్ మధ్య హోరాహోరీ సాగింది. ఫైనల్ పోటీలో ఫ్రెండ్లీ ఫైటర్స్ గెలుపొందారు. విజేతకు రూ.20వేలు నగదు బహుమతి, రన్నర్స్ జట్టుకు రూ.10వేలు నగదు పురస్కారం, మెమెంటో అందజేశారు. ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కారుమూరి సునీల్ ముఖ్య అతిథిగా పాల్గొని ట్రోఫీని అందజేశారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్లకు షీల్డ్‌లు అందజేశారు. ఫ్యూచర్ ఇండియా చైర్మన్ సావిత్రి, సరెళ్ళ, ఎస్‌బి సీఐ బోనం ఆదిప్రసాద్, టీడీపీ నాయకులు టి.రాజా, క్రీడాకారులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సాలో 'కెరీర్ టాక్స్'

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29: డిగ్రీ, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థినులకు ఉద్యోగావకాశాలపై ఉపాధికల్పన, శిక్షణ శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యంలో 'కెరీర్ టాక్స్' పేరిట సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో గురువారం సదస్సు జరిగింది. ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.హిమబిందు, రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డి, ఏలూరు, విజయవాడ, విశాఖ జిల్లాల ఎంప్లాయిమెంట్ ఆఫీసర్లు సి.మధుభూషణ్, వి.వరలక్ష్మి, బ్రహ్మానందం, సెట్‌వెల్ సీఈవో మెహర్రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు ఎడ్యుకేషన్ :** ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా బ్యాంకింగ్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆధ్వర్యంలో కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రాస్‌వర్డ్ పజిల్‌పోటీ నిర్వహించారు. విజేతలకు నగదుబహుమతులను ఎల్‌డీఎం డి.నీలాద్రి, శ్రీనివాసరావు అందజేశారు.
- **ఏలూరు రూరల్ :** శ్రీపర్రులో ఎమ్మెల్యే కొటారు అబ్బయ్య చౌదరి పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్, మైక్రో ఫిల్టర్‌బెడ్స్‌ను ప్రారంభించారు. సీసీ రోడ్లు, కల్వర్టు, తాగునీరు బోర్, కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- **ఉంగుటూరు :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ప్రముఖ గాయకురాలు సునీత పాల్గొంటారని అధ్యక్షురాలు శోభారాణి తెలిపారు.
- ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రథమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 137 మంది, గీతాంజలి జూనియర్ కళాశాలకు చెందిన 98 విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.వి.శ్రీనివాస్ తెలిపారు. తాను ఫ్లయింగ్ స్క్వాడ్‌గా వ్యవహరిస్తానని పేర్కొన్నారు.
- **బుట్టాయగూడెం :** మండలంలోని సీతప్పగూడెం పంచాయతీలోని మంచులవారిగూడెంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో కేరం వెంకటేశ్వరావుకు చెందిన తాటాకు ఇల్లు గురువారం దగ్ధమైంది. కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబానికి తహసీల్దార్ వెంకటేశ్వర్లు తక్షణసాయంగా ప్రభుత్వం నుంచి 25 కేజీల బియ్యం, కూరగాయలు, రూ.వెయ్యి నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.
- **జీలుగుమిల్లి :** పి.రాజవరం, జీలుగుమిల్లి గ్రామాల్లో గోదాములను పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో వలంటీర్లను సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఎంపీపీ కొర్స పోశమ్మ, జడ్పీటీసీ వసంత్, సర్పంచ్ చిర్రి జగదాంబ, ఎంపీడీవో కెఎం.మంగతాయారు, ఎస్సై వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఏరియా ఆసుపత్రి నూతన భవనాలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

ఏరియా ఆసుపత్రి భవనాలు ప్రారంభం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 29: ప్రజా ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నూజివీడు శాసన సభ్యులు మేకా వెంకటప్రతాప్ అప్పారావు, జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో రూ.21 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నూతన సంస్కరణలు చేస్తున్నారన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిని 100 పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయటానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమం లో కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కుప్పాల హారికవైస్ చైర్మన్ గుడిమెళ్ళ కృష్ణంరాజు, నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, నూజివీడు ఆర్డీవో భవానీశంకరీ, ఏరియాఆసుపత్రి సూపరింటెండెంట్ ఏ.వి.ఆర్ మోహన్‌రావు, సీనియర్ వైద్యులు నరేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సభను తలపించారు..

ఏరియా ఆసుపత్రి నూతన భవనాల ప్రారంభ కార్యక్రమం ఎన్నికల సభను తలపించింది. ఈ సందర్భంగా ఏలూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ జగన్ ఆశీస్సులతో ఏలూరు ఎంపీగా ఎన్నికవుతానని, ఏరియా ఆసుపత్రికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కృష్ణా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కుప్పాల హారిక నుంచి వివిధ స్థాయి ప్రజా ప్రతినిధులు అందరూ వచ్చే ఎన్నికల్లో నూజివీడు నుంచి ఎమ్మెల్యే ప్రతాప్‌ను, రాష్ట్రస్థాయిలో వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిందేనంటూ తమ ప్రసంగాల్లో పేర్కొనడంతో ఆసుపత్రి నూతన భవనాల ప్రారంభం సభ ఎన్నికల సభను తలపించింది.

3న పల్స్ పోలియో.. విజయవంతం చేయాలని పిలుపు

ముదినేపల్లి, ఫిబ్రవరి 29 : పల్స్ పోలియోను విజయవంతం చేయాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతి శ్రీ కోరారు. గురువారం ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 2202 మంది 5 సంవత్సరముల లోపు పిల్లలు ఉన్నారని, వారికి 22 కేంద్రాలు ఏర్పాటు చేశామని డాక్టర్ శాంతి శ్రీ తెలిపారు. నూరు శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: పోలియో మహమ్మారి పిల్లలకు సోకకుండా పోలియో చుక్కలు వేయించాలని నూజివీడు ఆర్డీవో భవానీ శంకరీ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నూజివీడు డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ జాస్తిజగన్మోహన్‌రావు మాట్లాడుతూ మీ చిన్నారుల నిండు జీవితాలకు పోలియో చుక్కలు ఆధారమని, పీహెచ్‌సీ పరిధిలో 36,254 మంది పిల్లలకు 352 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 34 రూట్‌లలో 760 మంది వైద్య సిబ్బందిని నియమించామని తెలిపారు.

చాట్రాయి: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మంగాకుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి కోరారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో 32 పోలియో కేంద్రాలలో 3527 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామని, 4,5 తేదీలలో ఇంటింటికి తిరుగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మచారి, ఐసీడీయస్ సూపర్‌వైజర్ గాయత్రి, సిహెచ్‌వో రమణ, ఎంపీహెచ్ఇవో శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


చాట్రాయిలో పల్స్‌పోలియో పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

కలిదిండి : మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని వైద్యాధికారులను ఎంపీడీవో దినతేజ్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పల్స్ పోలియో వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహన్‌రావు


పల్స్‌పోలియో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో

అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో చిన్నారులకు, ఇంటింటికి వెళ్లి చంటి పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. నూరుశాతం పల్స్ పోలియో నమోదు కావాలన్నారు. పోలియో చుక్కలతోనే అంగవైకల్యం దూరమ వుతుందని, పోలియో చుక్కలపై ఉన్న మూఢ నమ్మకాలను విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సాయి సుచిత, హేమంత్, ధీరజ్ కుమార్, సూపర్‌వైజర్ కృష్ణకిషోర్, ఎంఈవో ప్రభాకర్ బాబు పాల్గొన్నారు.

కైకలూరు కాంగ్రెస్ టిక్కెట్టు కోసం..



కైకలూరు, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ పార్టీ తరపున ఏకైక సర్పంచ్‌గా కైకలూరు మండలం ఆచవరం గ్రామానికి ఎన్నికయ్యాయని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కైకలూరు అసెంబ్లీ టిక్కెట్టును కాంగ్రెస్ పార్టీ తరపున తనకు కేటాయించాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డికి గ్రామ సర్పంచ్ కట్టా నాగరాజ్ గౌడ్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు విజయవాడలో గురువారం ఆమెను కలిసి దరఖాస్తు చేశారు.


గ్యాస్ స్టౌవ్ బండను అందిస్తున్న కొడాలి వినోద్

దివ్యాంగులకు గ్యాస్ స్టౌవ్, బండ వితరణ

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 29:మండలంలోని వైవాక గ్రామానికి చెందిన దివ్యాంగురాలు నేలబాలసుబ్బారావమ్మ బోయిన అలివేలుమంగలకు కైకలూరు నియోజకవర్గ టీడీపీ హోల్‌మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ గురువారం గ్యాస్‌స్టౌవ్‌బండ వితరణగా అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన పథకంలో సరఫరా చేసే ఉచిత గ్యాస్‌స్టౌవ్ పథకం సదరు దివ్యాంగులకు వర్తించకపోవడంతో గ్రామ టీడీపీ నాయకులు వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వినోద్ గ్రామ పర్యటనలో భాగంగా ఈ రోజు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో పద్మావతిదేవి

ఉపాధి పనులను త్వరితగతిన పూర్తిచేయండి

ముసునూరు, ఫిబ్రవరి 29: పెండింగ్‌లో ఉన్న ఉపాధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడివో సీహెచ్.పద్మావతిదేవి ఆదేశించారు. వలసపల్లి, గుళ్ళపూడి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్ల రికార్డులు, నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా? లేదా, అని కూలీలకు అందుతున్న సౌకర్యాలు ఆమె పరిశీలించారు. ఎంపీడివో మాట్లాడుతూ పనులకు కూలీలు హాజరు కాకుండా మస్టర్లు వేసి, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ప్రతి పని ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిగేలా ఎప్పటికప్పుడు టీఏలు పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా మార్చి చివరికి పెండింగ్ పనులు పూర్తి చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపిడివో ఆదేశించారు. ఏపీవో రోజ్‌లీల, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి చర్యలేవీ ?

పంట కాలువలో అక్రమ తూములు తొలగించాలని ఎమ్మెల్యేకు పలువురి వినతి

కైకలూరు, ఫిబ్రవరి 29: గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి నివారణ చర్యలను చేపట్టాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గురువారం కైకలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. శివారు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, కాలువలకు నీరు విడుదల చేసినా కైకలూరు, ఆటపాక, భుజబలపట్నం గ్రామాల్లో చేపలచెరువుల రైతులు అక్రమంగా పంట కాలువలకు తూములు ఏర్పాటు చేశారని, వెంటనే తొలగించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. మోటార్లు, ఇంజన్లతో మంచినీటిని తరలిస్తున్నారని అక్రమ తూములను గుర్తించి అధికారులు తొలగించాలని ఆలపాడు, పల్లెవాడ ప్రజా ప్రతినిధులు కోరారు. ఈ అక్రమ తూములను అరికడితేనే శివారు గ్రామాలకు త్రాగునీరు అందుదని, అధికారులు శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కురేళ్ళ బేబి, వైస్ ఎంపీపీ ఎండీ జహీర్, ఎండీవో ఉమామహేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అడవి కృష్ణ


విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 29: నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు దీర్ఘకాలిక ఇంటెర్న్‌షిప్‌కు ఎంపికయారని డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నూజివీడు క్యాంపస్‌లో ఇంటెర్న్‌షిప్‌కు ఎన్నికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన ఇంజినీరింగ్ ఎం.ఎం.వి ఫైనలియర్ విద్యార్థులు శ్రీకాళహస్తి ఆటో మొబైల్ విడిభాగాల తయారీ సంస్థ రాక్‌మన్‌కు నలుగురు రూ.4లక్షల , కుశలవ ఇంటర్‌నేషనల్స్ సంస్థ ఏడుగురు రూ.3 లక్షల వార్షిక వేతనంపై ఎంపికయ్యారన్నారు. వీరితోపాటు మరికొందరు నెలకు రూ.10నుంచి రూ.15వేలు స్టైఫండ్‌పై ఇంటర్న్‌షిప్ పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎం.వి విభాగం హెచ్‌వోడి మధుసూదన్‌రావు, అధ్యాపకులు వీరశ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకోవాలి

ముసునూరు, ఫిబ్రవరి 29: విద్యార్థులు ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకుని, ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంపిడివో సీహెచ్.పద్మావతిదేవి అన్నారు. గురువారం ముసునూరులో భారతీయ విద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ కొండేటి సౌరి ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన స్టాల్స్‌ను ఎంఈవో బి.వి.యస్.సుబ్బారావుతో కలిసి ఎంపిడివో సందర్శించారు. ఈ కార్యాక్రమంలో హెచ్ఎం ఏ.సునీల, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలపై కలెక్టరేట్ వద్ద రేపు ధర్నా

కొవ్వూరు, ఫిబ్రవరి 29: సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 2న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైబీవీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద స్థానిక సంస్థలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలు, సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని, 16 డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఈ ధర్నాలో రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొనాలని కోరారు.

నకిలీ డాక్యుమెంట్లతో మోసగించిన వ్యక్తిపై కేసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 29 : ఒక ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకుని గడువు పూర్తయినప్పటికీ మళ్లీ నకిలీ డాక్యుమెంట్లతో అగ్రిమెంట్ జరిగినట్టుగా సృష్టించి మోసగించిన ఓ వ్యక్తిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరు సమీపంలోని శనివారపుపేట రోడ్డు శాతవాహననగర్ లయన్స్ క్లబ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అట్లూరి దుర్గా నాగేశ్వరరావు కుమార్తె రమాదేవి అమెరికాలో ఉంటున్నారు. వీరికి శనివారపుపేటలో వున్న ఖాళీ స్థలాన్ని 2019లో బాపులపాడు మండలం పెదగయ కొయ్యేరుకు చెందిన గోగినేని నరసింహారావుకు లీజుకు ఇచ్చారు. నెలవారీ అద్దె చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. నరసింహారావు ఆ ఖాళీ స్థలంలో శ్రీస్వర్ణమిల్క్ అండ్ ఫుడ్ ప్రాసెస్ పేరుతో వ్యాపారం చేస్తున్నారు. లీజు గడువు తీరిన తరువాత ఖాళీ చేయాలని నాగేశ్వరరావు పలుమార్లు చెప్పినప్పటికీ ఖాళీ చేస్తామని కాలయాపన చేస్తూ ఆకస్మాత్తుగా నకిలీ అగ్రిమెంటు సృష్టించాడు. అట్లూరి నాగేశ్వరరావు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నరసింహారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.ప్రసాద్ తెలిపారు.

డిపాజిట్ సొమ్ములు ఇవ్వలేదని చీటింగ్ కేసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 29:డిపాజిట్ సొమ్ములు తిరిగి ఇవ్వకుండా మోసగించిన వారిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన డేగా వాణి 2011లో అభయా గోల్డ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్‌లో డిపాజిట్లు చేశారు. వాటి గడువు తీరినప్పటికి ఇవ్వకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు విజయవాడలోని ఏలూరు రోడ్డులో ఉన్న అభయ గోల్డ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్ దాని ప్రతినిధులుగా ఉన్న కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన సుంకర దుర్గారావు, అతని భార్య సుంకర రమాదేవిలపైఫిర్యాదు చేశారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం చీటింగ్ కేసు నమోదు చేసి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ ఆస్తి పన్ను చెల్లింపునకు వడ్డీ రాయితీ

భీమవరంటౌన్, ఫిబ్రవరి 29 :మునిసిపాల్టీలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పాత బకాయిలతోపాటు ఈ ఏడాదికి సంబంధించిన ఆస్తిపన్నును ఒకే మొత్తంలో చెల్లించే వారికి వడ్డీరాయితీ ఇస్తున్నట్టుగా జీవో విడుదల చేశారు. బకాయిలతో కలిపి ఒకేసారి చెల్లిస్తే మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని ఈమేరకు జీవో నంబరు 35 పేరిట ప్రిన్సిపల్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి విడుదల చేశారు. 15వ ఆర్థిక సంఘంకు సంబంధించి మునిసిపాల్టీల ఆస్తిపన్నును పూర్తిస్థాయిలో వసూళ్లు చేసేందుకు ఈ రాయితీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

వైసీపీని తరిమికొట్టాలి : కామినేని

మండవల్లి, ఫిబ్రవరి 29: అయ్యవారిరుద్రవరం పుట్లచెరువులో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ గురువారం టీడీపీ నేత గురుగుబెల్లి నరసింహారావు ఇంట పెళ్లి వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కామినేని స్థానిక నేతలతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో వైసీపీ తరిమి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం టీడీపీ-జనసేన నాయకులతో ముచ్చటించారు.


పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారి

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ముదినేపల్లి, ఫిబ్రవరి 29 : ఇంటర్మీడియట్ పరీక్షలకు ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలి రోజు ఈ పరీక్ష కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 118 మంది పరీక్షలు రాస్తున్నారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ డి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రభుత్వ కళాశాల, వీఆర్ కళాశాల, వికాస్ కళాశాలకు చెందిన ఈ పరీక్ష కేంద్రంలో మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్నారు. బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ డి.వెంకట్ కుమార్ తెలిపారు. గురువారం పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ నాగేశ్వరరావు పరిశీలించగా, చీఫ్ సూపరింటెండెంట్ ఇన్విజిలేటర్లకు తగు సూచనలు చేశారు.

కలిదిండి: మండలంలో కలిదిండి, కోరుకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎన్.గోపాల కృష్ణంరాజు, శ్యామ్ సన్ రాజులు తెలిపారు. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 94 మంది కోరుకొల్లులో, 41 మంది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

కోతుల బెడదతో జనం అవస్థలు



చాట్రాయి, ఫిబ్రవరి 29: మండలంలో కోతుల బెడదతో జనం బెంబేలెత్తుతున్నారు. ఇళ్ల పైకప్పులపై కోతుల మందలు ఎక్కి సర్వం నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. స్థానికంగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు, పండ్లు పాడు చేస్తున్నాయి. దారిన పోయే పలువురిపై దాడి చేస్తు న్నాయని ప్రజలు వాపోతున్నారు. దీంతో నిత్యం తలుపులు వేసుకొని భయం భయంగా గడుపు తున్నారు. ఇటీవల కోతుల దాడుల్లో చాలా మంది గాయపడిన సంఘటనలు జరిగాయి. పండ్లు, కూరగాయలు అమ్మే దుకాణదారులు కాపలా కాసుకోకపోతే సరుకు కోతుల పాలు అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్ప టికైనా అధికారులు స్పందించి కోతులను అడవులకు ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం


ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎస్పీ మేరి ప్రశాంతి

బలివే ఉత్సవాలకు బందోబస్తు

ముసునూరు, ఫిబ్రవరి 29: బలివే శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులపాటు జరిగే మహాశివరాత్రి మహోత్సవాలకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఏలూరు జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి తెలిపారు. గురువారం ఆమె ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు, స్వామి దర్శనానికి బారికేడ్లు, భక్తులకు జల్లుల స్నానాలు, దేవదాయ శాఖ నుంచి విక్రయించే దర్శన టికెట్లపై ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్, సర్పంచ్ ప్రవీణసుధాకర్‌ల నుండి ఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ట్రాఫిక్ పాయింట్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, షిఫ్ట్‌ల వారీగా ఏర్పాటు చేయాల్సిన బందోబస్తు, పోలీసు కంట్రోల్ రూమ్ తదితర వాటిపై డీఎస్పీ గోలి లక్ష్మయ్య, సీఐ కె.రామకృష్ణ, ఎస్ఐ పి.వాసులకు ఎస్పీ పలు సూచనలు ఇచ్చారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, ఆలయ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న పార్థసారధి తదితరులు

సిలువ గట్టు ప్రార్థనల్లో పార్థసారధి

నూజివీడు, ఫిబ్రవరి 29:నూజివీడు సిలువగట్టు తిరునాళ్ళలో నూజివీడు టీడీపీ ఇన్‌చార్జి కొలుసు పార్థసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ గొర్రుముచ్చు జోసఫ్, ఇతర దైవజనులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నూజివీడు టీడీపీ నాయకులు నూతక్కివేణు, పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మేరీ మాత ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



కలిదిండి, ఫిబ్రవరి 29 : కలిదిండిలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే మేరీ మాత ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా మని విచారణకర్త బంటుమిల్లి యోహాను తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మేరీమాత చర్చికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో ఉన్న కల్వరి కొండను శుభ్రపర్చి భక్తులు మొక్కు బడులు తీర్చుకోవటానికి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. గురువారం చర్చి వద్ద భక్తులు కొవ్వొత్తులతో ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర రహదారి పక్కనే మేరీ మాత చర్చి ఉండటంతో రహదారికి ఇరువైపులా పలు దుకాణాలు ఏర్పాటు చేయటంతో వాహనాల రాపోకలకు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మూడు రోజులు జరిగే మేరీ మాత ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు విచ్చేస్తారని ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రియకుమార్ హెచ్చరించారు.

మర్చిపోలేని పెళ్లి జ్ఞాపకం

» లీప్ సంవత్సరం.. ఫిబ్రవరి 29న భారీగా వివాహాలు

భీమవరం టౌన్,ఫిబ్రవరి 29 : ఈ ఏడాది ఫిబ్రవరి 29కి ప్రత్యేకస్థానం ఉంది.. లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి నెలాఖరి రోజు.. నాలుగేళ్లకు వచ్చే ఈరోజు కోసం చాలామంది ఎదురుచూస్తారు. దీనికి కారణం ఆ రోజు పెళ్ళిరోజుకావచ్చు, పుట్టిన రోజు కావచ్చు. మరేదైనా కావచ్చు అందుకే ఈ తేదీకి ప్రాముఖ్యత. ముహూర్తం బలంగా ఉండడంతో గురువారం రాత్రి జిల్లావ్యాప్తంగా వేలాది వివాహాలు జరిగాయి. రాత్రి 10.53 నిమిషాల ముహూర్తం బాగుండటంతో పాటు అన్ని నక్షత్రాల వారికి అనుకూలంగా ఉండడంతో చాలాచోట్ల వివాహాలు జరిగాయి. లగ్నంలో చంద్రుడు, సప్తమంల గురుడు ఉన్నకారణంగా ఇరువురు పరస్పర దృష్టి కలిగి ఉండడంతో బలమైన ముహూర్తంగా పండితులు చెబుతున్నారు. మాఘమాసంలో ఆఖరి ముహూర్తం ఇదే అని చెబుతున్నారు. ఈ తేదీన వివాహం చేసుకున్నవారు.. పుట్టిన వారు మరో నాలుగేళ్లకు పెళ్ళిరోజు, పుట్టినరోజులు జరుపుకోవాల్సి వస్తుంది. గతంలో ఈ విధంగా ముహూర్తాలు వచ్చిన సందర్భాలు ఉన్నట్టు చెబుతున్నారు. వచ్చే నెల 24 వరకు ముహూర్తాలు ఉన్నాయిని, మే నుంచి ఆరు నెలలపాటు ముహూర్తాలు ఉండవని, దీనికి కారణం శుక్ర, గురుమూఢాలు రావడంతోపాటు ఆషాడం, భాద్రపద మాసాలు శూన్యమాసాలు కావడంతో ఈ పరిస్థితి వచ్చింది.

జీడితోటల తొలగింపు అన్యాయం

» కొంతమంది బంధంచర్ల గ్రామస్థుల ధర్నా

టి.నరసాపురం, ఫిబ్రవరి 29:పూర్వకాలం నుంచి భూమిలో ఉన్న జీడి తోటల ఫలసాయమే జీవనాధారంతో జీవించే జీడితోటలను యంత్రాలతో తొలగించారని ఆరోపిస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బంధంచర్లకు చెందిన కొంత మంది గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన బేతి శేషయ్య, జాను, మరికొంత మంది ఆందోళన వ్యక్తం చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బంధంచర్లలోని తమ భూమిలో జీడి తోటలను నమ్ముకుని ఏళ్లపాటు జీవనం సాగిస్తున్నామన్నారు. సుమారు 40 ఏళ్ల నుంచి ఈ భూమిపై కోర్టు తగాదా నడుస్తుందన్నారు. ఈ క్రమంలో గురువారం పోలీసుల సహకారంతో అధికారులు జీడిచెట్లను తొలగించారన్నారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ సుభాష్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం భూమిపై హక్కు గల కుటుంబసభ్యులకు భూమిని అప్పగించాలని గత తహసీల్దార్ సుబ్బారావు ఆ భూమిని స్వాధీనం చేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.


ఎక్స్‌కవేటర్‌తో జీడి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

క్రైం కార్నర్

పెళ్లయిన ఆరు రోజులకే వ్యక్తి దుర్మరణం

మొగల్తూరు, ఫిబ్రవరి 29 :మండలంలోని కొత్తోటకు చెందిన పవన్‌కల్యాణ్ అభిమాని ఏనుగుల అంజిబాబు(30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తాడేపల్లిగూడెంలో బుధవారం నిర్వహించిన జనసేన, టీడీపీ ఉమ్మడి సభ జెండా సభకు వెళ్లిన అతడు సభ ముగిసిన అనంతరం అతడి స్నేహితుడు పిలుపు మేరకు జంగారెడ్డిగూడెం వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి కొత్తోట వస్తుండగా గోపాలపురం పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి చక్రపాణి అంధుడు కావడం, తల్లి మానసిక వైకల్యం కావడంతో పాలకొల్లులోని మెడికల్ షాపులో పనిచేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆరు రోజుల క్రితమే వివాహమైన అంజిబాబు మృతితో ఆ గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

పురుగు మందు తాగి ఒకరి ఆత్మహత్య

ముసునూరు, ఫిబ్రవరి 29: కడుపునొప్పి తాళలేక ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఈ ఘటనపై ముసునూరు ఎస్ఐ పి.వాసు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వలసపల్లికి చెందిన మల్లినేని సురేష్(38) కొంత కాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తుట్టుకోలేనంత కడుపునొప్పి రావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు సురేష్‌ను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళగా అప్పటికి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

ముదినేపల్లి, ఫిబ్రవరి 29 : పేరూరులో గురువారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 8 మంది జూదరులను ముదినేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో పేకాట సమాచారం అందుకున్న ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పోలీసు సిబ్బందితో దాడి చేసి వారి నుంచి రూ.27 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముసునూరు: గోపవరం శివారు నాగేంద్రపురం సెంటర్ వద్ద గురువారం జరుగుతున్న పేకాట శిబిరంపై ముసునూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.400 నగదు, 52ప్లేయింగ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

బాకీ ఇవ్వకపోవడంతో ఘర్షణ.. పలువురికి గాయాలు

ముసునూరు, ఫిబ్రవరి 29 : నగదు లావాదేవీలపై ఇరువర్గాల మధ్య జరిగిన పరస్పరదాడులతో ఆరుగురిపై ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేశారు. కాట్రేనిపాడుకు చెందిన పేరిచర్ల ఆంజనేయులు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన పేరిచర్ల రంగరావుకు వ్యవసాయ ఖర్చుల నిమిత్తం కొంత నగదు ఇచ్చాడు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో గాయపడ్డ ఆంజనేయులు, రంగరావులు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వాసు తెలిపారు.